Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 21.08.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees


# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## కళాశాలల్లో... మృత్యుహేల

- ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న నారాయణ విద్యాసంస్థలు
- చదువే వ్యాపారంగా, విలువలకు సమాధి కడుతున్న

తల్లిదండ్రుల ఆశ, శ్వాస, బ్రతుకు, భవిష్యత్ అంతా బిడ్డలే! తమ బ్రతుకును పణంగా పెట్టి బిడ్డల భవిష్యత్ బంగారుమయం చేయాలని కలలు కంటుంటారు. తమ బిడ్డలను తమ కలలకు ప్రతిరూపాలుగా భావిస్తుంటారు. బిడ్డలు మంచి చదువులు చదివి ఉన్నత స్థానాలలో ఉండాలని చెప్పి ఒక పూట తిని ఒక పూట పస్తుండి పుస్తకాలు కొనిస్తారు. పుస్తెలు అమ్మి కార్పొరేట్ కళాశాలల్లో వేలకు వేలు ఫీజులు కడుతుంటారు. వేల రూపాయలు కట్టి హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. మరి ఇలా బిడ్డల మీద ఆశలు పెంచుకుని కష్టనష్టాలకోర్చి చదివిస్తున్న తల్లిదండ్రులకు చివరకు మిగిలేది విషాదమేనా? జీవింతాంతం కన్నీళ్లేనా?

(మిగతా 11వ పేజీలో)



## ప్యాకేజీతో... బాబుకు డామేజీ

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లుగా బీహార్‌కు కేంద్రప్రభుత్వం ప్రకటించిన లక్షాపాతిక వేల కోట్ల భారీ ప్యాకేజీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై మరింత ఒత్తిడి పెంచనుంది. ఎన్నికల కోణంలో బీహార్‌కు కేంద్రం భారీ ప్యాకేజీ ఇచ్చింది. అయితే రాష్ట్ర విభజన వల్ల బీహార్ కంటే ఘోరంగా తయారైన ఆంధ్రప్రదేశ్‌కు ఇంతవరకు స్పెషల్ ప్యాకేజీలేమీ లేవు. కేంద్రం నుండి

(మిగతా 11వ పేజీలో)

# అపురూపం... ఆ దివ్యమంగళ స్వరూపం!

- అద్భుతంగా జరిగిన శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు
- నిర్వాహకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి భక్తుల జేజేలు



## నెల్లూరీయులను దీవించి ఏడుకొండలు చేరిన శ్రీనివాసుడు

నెల్లూరులో హఠాత్తుగా ఏదో వెలితి... మనలో వున్న ప్రశాంతత ఉన్నట్లుండి మాయమైన్నట్లు... మన కళ్ల ముందున్న అద్భుత ప్రపంచం అదృశ్యమైనట్లు... ఏదో కొరత. ఆ వేద మంత్రాలేమయ్యాయి... ఆ మంగళ వాయిద్యాలు ఎక్కడికి పోయాయి.. మనసులను హత్తుకునే ఆ గోవిందనామాల స్మరణ లేవి... ఈ వెలితికంతటికీ కారణం 9 రోజుల పాటు నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో కొలువుదీరి లక్షలాదిమంది భక్తులకు దర్శనమిచ్చిన ఆ దివ్యమంగళ స్వరూపుడు శ్రీనివాసుడు తన నెల్లూరు విడిదిని ముగించి తిరుమలకు చేరుకోవడమే! అప్పుడే అయిపోయాయా అని కొందరు... ఇంకొన్నిరోజులు ఉంటే బాగుండు అని ఇంకొందరు... అసలు ఎప్పుడూ ఇలానే వుంటే చాలా బాగుంటుందని అందరూ అనుకునే రీతిలో నెల్లూరు ఏ.సి. స్టేడియంలో సేవాఋషి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పంతో స్వర్ణభారత్ ట్రస్ట్ సహకారంతో టిటిడి, హిందూధర్మ ప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో 9రోజుల పాటు నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు కనుల పండువగా ముగిసాయి.

(మిగతా 3వ పేజీలో)


FREEDOM SALE
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
FLAT 50% off
FLAT 30% off
అన్ని రకాల వస్త్రాలపై
ఆంధ్రప్రదేశ్
కళానికేతన్® షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్. 2316677
*Conditions Apply.
doocreative.com

# నెల్లూరీయుడికి రాష్ట్రపతి పతకం



నెల్లూరీయులు ఎక్కడున్నా, ఏ రంగంలో వున్నా తమ ప్రతిభాపాటవాలను చాటుతుంటారు. అలాంటి నెల్లూరు కీర్తి పతాకమే ఎస్.వాసుదేవ రావు. మన నెల్లూరోడు, ఢిల్లీ పోలీసు విభాగంలో వెల్ఫేర్ అండ్ ఎస్టేట్ ఓవర్ సైట్ స్పెషల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ మెడల్‌కు ఎంపికయ్యారు. 69వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయనకు ఈ మెడల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. నెల్లూరుజిల్లా కావలి పట్టణానికి చెందిన సూరపరాజు వాసుదేవరావు విద్యాభ్యాసం అక్కడే జరిగింది. కావలి జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి వరకు చదివారు. జవహర్‌భారతి కళాశాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేశారు. 1986లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. పోలీసు విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. 2002లో మెరిటోరియస్ సర్వీసెస్ క్రింద ప్రెసిడెంట్ మెడల్‌ను అందుకున్నారు. 2004లో సునామీ సంభవించినప్పుడు అండమాన్ దీవుల్లో అందించిన సేవలకుగాను కమాండేషన్ అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో 'ఉపనిషత్తులు–ఒక అనుశీలన' పేరుతో తెలుగు ఉపనిషత్తుల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఒక పుస్తకాన్ని ఆవిష్కరించారు. నెల్లూరులో చిన్నమొత్తాల పొదుపు సంస్థ డిప్యూటి తహశీల్దార్‌గా పనిచేసిన రాళ్ళపల్లి రామసుబ్బారావుకు వాసుదేవరావు అత్యంత సన్నిహితులు. పుట్టిన ఊరికి మంచి పేరు తెస్తూ దేశానికి సేవచేస్తూ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్న వాసుదేవరావుకు 'లాయర్' అభినందనలు.

# అత్యుత్తమ సెజ్ శ్రీసిటీ

## - స్పీకర్ కోడెల శివప్రసాద్ ప్రశంస



రాష్ట్రంలో అత్యుత్తమ సేవలందిస్తున్న సెజ్ శ్రీసిటీ అని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ప్రశంసించారు. స్పీకర్ కోడెల శివప్రసాద్ నేతృత్వంలో 70 మంది అసెంబ్లీ బృంద సభ్యులు బుధవారం శ్రీ సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, సహజంగా సెజ్‌లంటే చాలామందిలో రియల్‌ఎస్టేట్ అనే దురభిప్రాయం వుండేదని, శ్రీసిటీతో అలాంటి అభిప్రాయం తొలగిపోయిందన్నారు. శ్రీసిటీ ప్రగతికి బాటలు వేసిన శ్రీనిరాజు, రవీంద్ర సన్నారెడ్డిలను ఆయన అభినందించారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, శాసనమండలి డిప్యూటీ ఛైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి, చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ పర్యటనలో పాల్గొన్నారు. రెండురోజులు స్టడీ టూర్‌లో భాగంగా వారు శ్రీసిటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు వారికి సాదరంగా స్వాగతం పలికి, బిజినెస్ సెంటర్‌లో శ్రీసిటీ ప్రగతి గురించి వివరించారు.

సింహపురి సమాచారం

# సమస్యలపై సంపన్నులు స్పందించాలి



సమాజ సమస్యలపై సంపన్నులు స్పందించి చేయూతనివ్వాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నెల్లూరు 37వ డివిజన్ క్రాంతినగర్ నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఫర్నీచర్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్‌ను ఏటిఎం కార్పొరేటర్‌గా అభివర్ణించారు. ప్రజలకు సమస్యలు ఎదురైతే ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటాడని, అందువల్లే ఆయనకు ఆ పేరు సరిపోతుందన్నారు. మిగతా కార్పొరేటర్లు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ప్రజల సమస్యలకు తక్షణం స్పందించాలన్నారు. పాఠశాలకు ఫర్నీచర్, విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేసిన దాత మాజీఎమ్మెల్యే రామారావు కుమార్తెకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కోవూరులో ముచ్చటగా తిరంగా పండుగ



ఈ నెల 15వ తేదీన కోవూరులోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో 69వ స్వాతంత్ర్య వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. నెల్లూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్ తర్వాత భారీస్థాయిలో ఇక్కడే స్వాతంత్ర్య వేడుకలు జరగడం విశేషం. పోలంరెడ్డి సేవా సమితి అధ్యక్షులు సన్నపరెడ్డి వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకల ఏర్పాట్లు జరిగాయి. కోవూరు శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేసారు. ఆయన స్వాతంత్రోద్యమంలో త్యాగధనుల కృషిని వివరించారు. రాష్ట్ర ప్రగతి కోసం చంద్రబాబు చేపడుతున్న కార్యక్రమాల గురించి మాట్లాడారు. కోవూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చి, ఇందుకూరుపేట మండలాలల తహశీల్దార్లు, ఎస్ఐలు,



ఇతర అధికారులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ 5 మండలాలల నుండి దాదాపు 4వేల మంది విద్యార్థులు హాజరై ఈ వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా 9, 10తరగతులలో ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

# జగన్ 'బంద్'లు.. విద్యార్థులకు ఇబ్బందులు

## - సోమిరెడ్డి విమర్శ



చీటికీమాటికీ బంద్ పిలుపులనిస్తూ జగన్ విద్యార్థుల భవితకు లేనిపోని ఇబ్బందులు పెడుతున్నారంటూ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. ఒకవైపు రాష్ట్ర హక్కుల్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు, ఎంపీలు పోరాటం చేస్తుంటే బంద్ పిలుపులతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. బంద్‌ల పేరుతో విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారంటూ ఆయన జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఈ నెల 7న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారని, 11న సిపిఎం చేపట్టిన బంద్‌లో జగన్ పాల్గొన్నారని, ఇప్పుడు తాజాగా ఇదే నెల 29న రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడం దారుణమని ఆయన అన్నారు. ఇలా నెలలో నాలుగు సార్లు బంద్‌లు చేస్తుంటే విద్యార్థులు సిలబస్ పూర్తికాక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి బాగా కృషిచేస్తూ వేల కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. జగన్ చేయతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను స్వచ్ఛంధంగా కాల్డ్‌ఆఫ్ చేయాలని ఆయన కోరారు. ఈ సమా వేశంలో టిడిపి జిల్లా నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, వి.సంపత్‌రాజు, తిరుమల నాయుడు, అమృల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న 'స్వర్ణాంధ్రప్రదేశ్' నృత్యరూపకం




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న నెల్లూరు పోలీస్‌పెరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన 69వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో నెల్లూరులోని మైథిలీ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'స్వర్ణాంధ్రప్రదేశ్' నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు మరింతగా వివరించాలనే ఉద్దేశ్యంతో రూపొందించిన ఈ నృత్యరూపకానికి ప్రత్యేక ప్రశంసలు లభించాయి. 'స్వర్ణాంధ్ర పిలిచింది రారండోయ్!.. పదము పదమూ కలిపి కద లండోయ్!–నవ్యాంధ్ర కదిలింది రారండోయ్.. ప్రగతి పథమున కలసి నడవండోయ్' అంటూ చిన్నారులు ఎంతో ఉత్సాహంతో ప్రదర్శించిన నృత్యాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం.జానకి తదితర అధికారులందరూ ఈ నృత్యరూపకాన్ని తిలకించి అభినందించారు. ఈ నృత్యరూపక ప్రదర్శనకు సారధ్యం వహించిన మైథిలి మనోహర్‌రెడ్డికి, చిన్నారులకు మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా జ్ఞాపికను బహుకరించారు.

# రవిచంద్రకు పరామర్శల వెల్లువ

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నివాసానికి బుధవారం స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు వెళ్లారు. ఇటీవల కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న రవిచంద్రను ఆయన పరామర్శించారు. రవిచంద్ర గాయంతో ఇంట్లో వున్నప్పటి నుండి పరామర్శల వెల్లువ మొదలైంది. నెల్లూరుజిల్లాకు వచ్చిన మంత్రులంతా కూడా రవిచంద్ర ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శిస్తున్నారు. జిల్లా తెలుగుదేశంపార్టీ నాయకులే కాక రవిచంద్రతో సంబంధాలున్న అన్ని పక్షాల నాయకులు కూడా తమకు వీలుదొరికినప్పుడల్లా ఆయన ఇంటికెళ్లి పలకరించి వస్తున్నారు. ఈ పరామర్శల ముచ్చట్లతో రవిచంద్ర తన కాలి బాధను కూడా మరచిపోతున్నాడు.

# అపురూపం... ఆ దివ్యమంగళ స్వరూపం!



వైభవోత్సవాల 9రోజులలో నెల్లూరు నగరం ఒక నమూనా తిరుమలగా మారింది. 7వ తేదీ సంకల్పంతో మొదలైన ఈ ఉత్సవాలు ఈ నెల 16వ తేదీన పుష్పాభిషేకంతో ముగిసాయి. గత వారం పాఠకులకు 13వ తేదీ వరకు జరిగిన కార్యక్రమాలను గురించి అందించాం. 14, 15, 16తేదీలలో అయితే ఇసుకేస్తే రాలనంతగా భక్త జనంతో ఏ.సి. స్టేడియం కిక్కిరిసిపోయింది. శ్రీ వెంకటేశ్వరుడి మీద భక్తులకు వున్న భక్తి విశ్వాసాలకు ఈ ఉత్సవాలు అద్దం పట్టాయి. 14వ తేదీ అభిషేకం బ్రహ్మాండంగా జరిగింది. 15వ తేదీ సాయంత్రం జరిగిన కళ్యాణోత్సవానికైతే... వచ్చిన భక్తులకు ఏ.సి స్టేడియంల లాంటివి పదయినా చాలవనిపించింది. అంతగా భక్త జనం పోటెత్తి వచ్చారు. 16వ తేదీ ఉదయం పుష్పాభిషేకంతో నెల్లూరే పులకించిపోయింది.

14వ తేదీ నిర్వహించిన దేవదేవుని అభిషేక మహోత్సవం భక్తులకు కనువిందు చేసింది. శ్రీవారి మూల విరాట్‌కు అభిషేక మహోత్సవాన్ని టిటిడి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా జరిపించారు. అభిషేకానికి కావలసిన వస్త్రాలు, ద్రవ్యాలను టిటిడి జెఇఓ పోలా భాస్కర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమర్పించారు. కనులపండువగా నిర్వహించిన అభిషేకాన్ని తిలకించిన వేలాదిమంది భక్తులు పరవశించారు. సాంస్కృతిక ప్రదర్శనలో ఆశ్రితారెడ్డి శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్టీ దీపావెంకట్, టిటిడి మాజీఛైర్మెన్ కనుమూరి బాపిరాజు, ఎస్పీ గజరావు భూపాల్ పాల్గొన్నారు.

15వ తేదీ రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులతో స్టేడియం జనసంద్రమైంది. గోవిందనామ స్మరణ నడుమ మాంగల్యధారణ మహోత్సవాన్ని టిటిడి అర్చకులు కమనీయంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవ మూర్తులను అర్చకులు, వేదపండితులు స్వర్ణ, వస్త్రాభరణాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం టిటిడి అర్చకస్వాముల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీ శ్రీనివాసుడు కమనీయంగా శ్రీదేవి, భూదేవిలకు మాంగల్యధారణ చేసారు. శాస్త్రోక్తంగా జరిగిన కల్యాణోత్సవాన్ని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని తిలకించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ నెల్లూరులో జరుగుతున్న వైభవోత్సవాలు సింహపురి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవిగా పేర్కొన్నారు. శ్రీవారి సేవల వైభవాన్ని నెల్లూరు ప్రజలకు చేరువ చేసిన పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు. ఈ కల్యాణోత్సవంలో రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కామినేని శ్రీనివాస్, టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, టిటిడి ఇఓ సాంబశివరావు, జేఇఓ పోలా భాస్కర్, జిల్లా కలెక్టర్ యం.జానకి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్, టిటిడి మాజీ ఛైర్మెన్ కనుమూరి బాపిరాజు, ట్రస్టు బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


16వ తేదీ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి నిర్వహించిన పుష్పయాగం సప్తవర్ణ శోభితంగా భక్తులకు కనువిందు చేసింది. విశేష స్వర్ణ వస్త్రాభరణాలతో దర్శనమిచ్చిన శ్రీవారి దివ్యమనోహర రూపాన్ని అశేష భక్తజనం వీక్షించి తరించారు. మల్లె, రోజా, చామంతి, సంపంగి, మొగలి, నూరువరహాలు, బంతి తదితర 21రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పనీరాజనం సమర్పించారు.

### పుష్పయాగంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు

దేవదేవుని పుష్పయాగంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు, కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి స్మృతి ఇరాని, ఉభయదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కామినేని శ్రీనివాస్, నెల్లూరు, తిరుపతి ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపావెంకట్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, టిటిడి జెఇఓ పోలా భాస్కర్, సభ్యులు భానుప్రకాష్ తదితర నగరప్రముఖులు పాల్గొన్నారు. వైభవోత్సవాల్లో దాదాపు 10లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. హుండీ ద్వారా 9రోజులు రూ.44లక్షలు పైగా ఆదాయం లభించింది.

### ప్రతి ఒక్కరికీ తిరునామాలు

ఈ ఉత్సవాలలో అందరి ముఖాలపైనా భక్తి భావం కొట్టొచ్చేలా కనిపించేలా చేసింది శ్రీకృష్ణ చరిత మానస మండలి వారు పెట్టిన తిరునామాలే! ఆడ మగ తేడా లేకుండా ఈ ఉత్సవాలకు వచ్చిన ప్రతి ఒక్కరికీ వాళ్లు ఓపికగా తిరునామాలు దిద్ది, ఆ నామధారణలో వున్న పవిత్రతను తెలియజేశారు.



## స్ఫూర్తి ప్రదాత కృష్ణమూర్తి

**ఈ వైభవోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి పాత్ర విస్మరించలేము. టిటిడి ఛైర్మెన్ అయ్యాక తిరుమల తర్వాత ఆయన ఎక్కువగా గడిపింది ఈ ఉత్సవాల్లోనే! అలాగే టిటిడి సిబ్బంది కూడా నిష్ఠగా ఈ ఉత్సవాలను జరిపించారు.**



## నెరవేరిన వేమిరెడ్డి కల

**ఈ ఉత్సవాలలో హైలెట్ కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు వంటి విఐపిలు రావడం కాదు, వాళ్లు తిరుమలకు వెళ్లినా రాచ మర్యాదలుంటాయి. ఈ ఉత్సవాలు చేసింది వారి కోసం కాదు. సామాన్య భక్తులకు శ్రీవారి సేవలను చూపించాలన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆశయం నెరవేరింది. విఐపి పాస్‌లు లేవు, విఐపి సంస్కృతి లేదు. లక్షల సంఖ్యలో సామాన్య భక్తులు వచ్చి శ్రీవారి సేవల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించి తరించారు. అందుకు ఉదాహరణ స్వామి వారి వద్ద ఏర్పాటు చేసిన హుండీలోని కానుకలే! ఇక్కడ హుండీలో ఎక్కువుగా పదిరూపాయల నోట్లే వచ్చాయి. పేద ప్రజలు వేసిన కానుకలవి. అదే వందల కోట్లతో సమానం. పేదవాడు భక్తితో వేసిన పదినోటు కూడా పదికోట్ల కింద లెఖ్ఖే!**

### దేవుడి కార్యక్రమం పై కూడా...

## కుళ్లు రాజకీయమా?

నెల్లూరులో జరిగిన శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలను ప్రజలంతా మెచ్చుకున్నారు. భక్తులంతా హర్షించారు. ఈ కార్యక్రమానికి రాజకీయం వాసన లేదు. అన్ని పార్టీల నాయకులు తమ జెండాలను, ఎజెండాలను పక్కనపెట్టి ఈ వేడుకలలో పాల్గొని భక్తి తన్మయత్వం చెందారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకుని ఎలాంటి రాజకీయ వాసనలు లేకుండా చేసారు. అయితే జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు మాత్రం ఈ వేడుకలను చూసి మనసులో కుళ్లుకున్నారు. కడుపు మంటతో రగిలిపోయారు. తమ అక్కసును వెళ్లబోసుకున్నారు. వారు ముగ్గురెవరో కాదు మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావులు. తనను సంప్రదించకుండానే నెల్లూరులో ఈ కార్యక్రమం తలపెట్టారని టీటీడీ ఛైర్మెన్‌పై నారాయణ నిష్ఠూరపడ్డాడు. వేమిరెడ్డి వైకాపా నాయకుడని, ఆయన ఆధ్వర్యంలో ఎలా ఈ వైభవోత్సవాలు నిర్వహిస్తారని కురుగొండ్ల, బొల్లినేని రామారావులు టిటిడి ఛైర్మెన్‌ను అడిగారు. వీళ్ల కుళ్లు బుద్ధి అర్ధమైన ఆయన పెద్దగా లెక్కలోకి కూడా తీసుకున్నట్లు లేదు. శ్రీ వెంకటేశ్వరస్వామి వైభవాన్ని నిర్వహించాలంటే ఆ దేవదేవుని అనుగ్రహం కావాలి. ఆయనే వేమిరెడ్డికి పర్మిషన్ ఇచ్చేసాడు. జిల్లాలో వందల, వేల కోట్లున్న వారు వందల్లో వున్నారు, వారికి లేని ఆలోచన స్వామివారు వేమిరెడ్డికి కలిగించారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సైతం వేమిరెడ్డి సంకల్పంతోనే ఈ వైభవోత్సవాలు జరిగాయని అభినందించారు. ఈ వైభవోత్సవాలను జరపడం వల్ల లక్షలాది మంది భక్తులు అరుదైన శ్రీవారి సేవలను ప్రత్యక్షంగా తిలకించి ఆనందించారనే కనీస ఆలోచన కూడా వీరికి లేకుండా పోయింది. దైవ కార్యక్రమాల్లో కూడా రాజకీయాలను జొప్పించే ఇలాంటి నాయకులకు ప్రజలే బుద్ధి చెపుతారు. స్మగ్లింగ్‌ల ద్వారా కోట్లు సంపాదించి ఒకరు, అప్పిచ్చిన వారికి పంగనామాలు పెడుతూ ఒకరు, ఆ దోచుకున్న డబ్బుల ద్వారా ఎన్నికల్లోకొచ్చి నోట్లు పంచి ఓట్లు సంపాదించుకుని, తామేదో పెద్ద ప్రజానాయకులమని, ప్రజాసేవకులమని ఫోజులిచ్చుకునే ఇలాంటి వారికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆ మహా దైవకార్యక్రమాన్ని గురించి విమర్శించే హక్కు, వేలెత్తి చూపే అర్హత, కనీసం ఆ ప్రాంగణంలో అడుగుపెట్టగలిగే భాగ్యం కూడా లేదు. అందుకే శ్రీవారు వాళ్ళని అక్కడ దర్శనానికి కూడా రానీయలేదు. రాజకీయాలు వేరు... ఆధ్యాత్మికం వేరు. రాజకీయాన్ని, భక్తిని ఒకే దృష్టితో చూసే ఇలాంటి వారికి ప్రజలే కాదు, ఆ భగవంతుడు కూడా తప్పక గుణపాఠం చెబుతాడు.









## 'ప్రభా'తం

# 'ప్యాకేజీ' రాజకీయాలు

**ఎన్నికలొస్తే చాలు నాయకుల వాగ్దానాలకు అంతే వుండదు. అందులోనూ ఇప్పుడు ప్యాకేజీ రాజకీయాలు వచ్చేశాయి. బీహార్‌కు 1.25 లక్షల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ప్రధాని మోడీ సంచలనం సృష్టించారు. కానీ, అధికారంలోకి వచ్చాక ఇలాంటి హామీలు అమలులోకి వస్తాయన్న గ్యారంటీ వుండడం లేదు. అందుకు మన రాష్ట్రమే ప్రత్యక్ష ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన నేతలు.. తీరా అధికారం లోకి వచ్చాక... నేటికీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చకపోవడం నేటి అస్తవ్యస్థ రాజకీయాల తీరుకు నిలువెత్తు నిదర్శనం.**

ఇప్పుడు దేశం సరికొత్త ప్యాకేజీల రాజకీయాలతో సంచలనంగా వుంది. ఎన్నికల సమయం వస్తే చాలు రాజకీయనాయకుల నుంచి హామీలకు కొదవుండదు. ఓట్ల కోసం లక్షల కోట్లు విలువజేసే అభివృద్ది పనులన్నిటికీ హామీలు ఇచ్చేస్తుంటారు. తీరా ఎన్నికల గట్టెక్కాక, ఆ హామీలకు ఇట్టే మంగళం పాడేస్తుంటారు. అయితే, ఎన్నికల సమయంలో అధికారంలో వున్న పార్టీలు కూడా ఓట్ల కోసం లక్షల కోట్లు ప్యాకేజీలుగా ప్రకటిస్తుండడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా వుంటోంది. భారీ ప్యాకేజీలు ప్రకటిస్తే చాలు, ఓట్లు వాటంతటవే రాలిపోతాయని భావిస్తుండడమే అందుకు కారణం కావచ్చు. ఇప్పుడు ఆ దారినే కమలనాథులు కూడా పయనిస్తుండడం రాజకీయవర్గాల్లో మరింత కలకలం రేకెత్తిస్తోంది.

బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ బీహార్ అభివృద్దికి ఏకంగా 1.25 లక్షల కోట్లు ప్యాకేజీ ప్రకటించడం చూస్తే సామాన్యులు సైతం ఇది కలా?.. నిజమా?.. అన్నట్లు ఆశ్చర్యపోతున్నారు. అయితే, ఎన్నికల సమయంలో ఈ ప్రత్యేక ప్యాకేజీల ప్రకటించడం వెనుక అంతరార్థం ఎన్నికల రాజకీయమేనని అందరికీ తెలిసిందే. వాస్తవానికి, బీహార్ అభివృద్దికి కేంద్రం నిధులు ఇవ్వడాన్ని ఎవ్వరూ కాదనలేరు. కానీ, ఆ ప్యాకేజీల ప్రకటన ఎన్నికల వేళ రావడమే విమర్శలకు దారితీస్తోంది. అసలు, నిధుల కంటే ముందు బీహార్ ప్రత్యేకహోదాను కోరు కుంటోంది. ప్రత్యేకహోదా అంటూ వస్తే అభివృద్దికి మార్గం వేసినట్లవుతుందని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్, అక్కడి మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ కోరుతున్నారు కూడా. బీహార్ అభివృద్దికి అసలు ప్రత్యేక ప్యాకేజీ సరిపోదని, ప్రత్యేకహోదా కల్పించాలని, అంతేతప్ప ప్రత్యేక ప్యాకేజీలు కేవలం ప్రధాని గిమ్మిక్కులేనని వారు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా 'ఓట్ల కోసం ప్యాకేజీలు ప్రకటించడం మోడీకి అలవాటే'నంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శల విషయం అటుంచితే, అసలు బీహార్‌కు ప్రత్యేకహోదా కల్పిస్తారా లేదా అన్నది మాత్రం ఇంకా డోలాయమానమే. బీహార్‌కు నిధులు కేటాయించడం పట్ల ఎవరికీ అభ్యంతరం వుండక్కరలేదు గానీ, ఆ కేటాయింపులు ఎన్నికల ముందు ప్రకటించడమే ఈ కలకలానికంతా కారణమవుతోంది. ఎందుకంటే, ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలు, తీరా అధికారంలోకి వచ్చాక అమలులోకి వస్తాయన్న గ్యారంటీ లేకపోవడమే. అందుకు మన రాష్ట్రమే ప్రత్యక్ష ఉదాహరణ. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ అష్టకష్టాల పాలైనప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పిన నేతలంతా అప్పట్లోనే ఎవరిపాటికి వారు చల్లగా జారుకున్నారు. ఆ తర్వాత, కష్టాల్లో వున్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకుంటామన్న ప్రధాని మోడీ కూడా ఇప్పుడు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చే విషయంలో ఇంకా ఒక స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఈలోగా కమలనాథులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయం అసలు విభజన చట్టంలోనే లేదని, అయినా ఆ హోదా ఇచ్చే విషయం కేంద్రం పరిశీలిస్తుందని ఇలా రకరకాలుగా ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్రానికి హోదా ఇచ్చే విషయంలో అన్ని విషయాలూ పరిశీలించాలని ఒకవైపు, ఇతర రాష్ట్రాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సివుంటుందని మరోవైపు.. ఇలా ఎప్పటికప్పుడు ఏదో ఒక సాకు చెప్పూనే కాలయాపన చేస్తున్నారు తప్ప, అధికారంలోకి వచ్చి అక్షరాలా పద్నాలుగు నెలలు గడుస్తున్నా ప్రత్యేకహోదాపై నిర్ణయం తీసుకోకపోవడం అందుకు నిదర్శనం. దేశంలో బీజెపి, రాష్ట్రంలో టిడిపికి ఓట్లేసి గెలిపించిన ఈ రాష్ట్రంలో, బీజెపిలో భాగస్వామిగా వున్న టిడిపియే ఇక్కడ అధికారంలో వున్నా.. ఈ రాష్ట్రానికి ఎన్నికలప్పుడు ఇచ్చిన 'ప్రత్యేకహోదా' హామీ విషయంలో కేంద్రం ఇంకా మీన మేషాలు లెక్కబెడుతూ, సన్నాయి నొక్కులు నొక్కుతుండడమే అన్నిటికంటే బాధాకరమైన విషయం. మరీ గట్టిగా మాట్లాడితే, అసలు 'ప్రత్యేకహోదా' అనే పేరు వల్ల జరిగేదీ.. ఒరిగేదేమీ వుండదని, అంతకంటే ఎక్కువగా ప్యాకేజీ నిధులు ఇస్తామని కమలనాధుల సముదాయిస్తూనే మరింత కాలయాపన చేస్తున్నారే తప్ప ఆచరణలో ఒక్క అంగుళం కూడా ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితి అంతటికీ ఎన్నికల రాజకీయాలే పరోక్ష కారణమని సామాన్య ప్రజలకు కూడా అర్థమవుతోంది.

విభజన కష్టాలతో రాష్ట్రం అతలాకుతలమవు తున్నా, రాజధాని కూడా లేక పరిపాలన అస్తవ్యస్తమవు తున్నా కేంద్రం పట్టించుకోకపోవడమే బాధాకరం. కేంద్రంలో బీజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే ఇక అన్ని బాధలూ తీరిపోతాయని ఆశించిన రాష్ట్ర ప్రజలకు.. ఇంతదాకా ప్రజలాశించిన ప్రత్యేక హోదా కానీ, ఇటు ఆశించిన స్థాయిలో ప్రత్యేక ప్యాకేజీల నిధులు గానీ ఏమీ లేకుండానే నెలల తరబడి కాలయాపన జరిగిపోవడం దారుణం. చివరికి ప్రతి పక్షాలు ఆందోళనల బాటపట్టినా పట్టించుకోక పోవడం విచారకరం. ఎన్నికల ప్రచారవేదికల్లో జంటగా కలిసి, తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామంటూ ప్రజల కరతాళధ్వనుల మధ్య ఇచ్చిన అత్యంత ముఖ్యమైన హామీని నెరవేర్చడానికి నాయకులకు ఇంకా ఎంతకాలం కావాలో అర్థం కావడం లేదని ప్రజల బాధ. అయినా, 14 నెలల తర్వాత కూడా ఈ విషయమై ఇంకా చర్చలు జరపాలనుకోవడం ఏ మాత్రం న్యాయమో అధికారనేతలకే తెలియాలి. త్వరలో జరుగనున్న ప్రధాని - ముఖ్యమంత్రి చర్చల్లోనైనా దీనిపై ఒక మంచి నిర్ణయం వస్తుందని ఆశిద్దాం. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తారో ?.. లేదా.. ప్రత్యేక ప్యాకేజీలే ఇస్తారో?.. మరి వేచిచూడాల్సిందే.

ఏదేమైనప్పటికీ, విభజనతో పడుతున్న కష్టనష్టాలను అధిగమించి రాష్ట్రం ప్రగతిబాట పట్టడానికి, నవ్యాంధ్ర అభివృద్దిపథంలో పురోగమించడానికి అవసరమైన అన్ని నిర్ణయాలూ మన నేతలు చిత్త శుద్దితో తీసుకుంటారని మనమంతా మనసారా కోరుకుందాం!...

# గౌతు లచ్చన్న ఆశయాల బాటలో నడుద్దాం

### - బిసి సంఘం నాయకులు

పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన గౌతు లచ్చన్న ఆశయాల బాటలో అందరూ నడవాలని, స్వాతంత్య్ర ఫలాలు అట్టడుగు వర్గాలవారికి కూడా అందాలనే ధ్యేయంతో ఆయన ఎన్నో పోరా టాలు చేశారని బిసి జనసభ గౌరవా ధ్యక్షులు నరసింహులు గౌడ్ అన్నారు. ఈ నెల 16న నగరంలోని అంబేద్కర్‌నగర్‌లో బీసి సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 106వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసభ నాయకులు యస్‌యస్ యాదవ్, పివిఎన్ రావు, అన్నం దయాకర్‌గౌడ్, కిన్నెర మాలకొండయ్య, స్వర్ణ వెంకయ్య, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న**

బీసీ వర్గాల అభ్యున్నతికి అహర్నహం పాటుపడిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అంటూ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య అన్నారు. నెల్లూరు రామ్మూర్తి నగర్‌లోని సీమాంధ్ర బీసీ భవన్‌లో ఆది వారం జరిగిన కార్యక్రమంలో వారు గౌతు లచ్చన్నకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో మొట్టమొదటి బిసి సంఘాన్ని ప్రారంభించింది సర్దార్ గౌతు లచ్చన్నేనని అన్నారు. ఆయన స్ఫూర్తి అందరికీ మార్గ దర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు కెవిస్ చక్రధారి, జిల్లా నాయకులు నారాయణయాదవ్, శ్రీనివాసులు, విజయకుమార్, వెంకటేశ్వర్లు, మధుబాబు, కేశవనారాయణ, జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సేవాదళ్

## అధ్యక్షునిగా శివప్రసాద్

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షునిగా డి. శివప్రసాద్ నియమితులయ్యారు. ఆయనను సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు భవాని నాగేంద్ర ప్రసాద్ నియమించారు. ఈ పదవి రావడానికి కారణమైన పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, పనబాక లక్ష్మి, ఆనం వివేకానందరెడ్డి, డిసిసి అధ్యక్షుడు ధనుంజయరెడ్డిలకు ఆయన ఈ సంద ర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు.

# మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

### - టిడిపిలో సంబరాలు

పట్టిసీమలో నీళ్ళు తెప్పించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పినమాటను నిలబెట్టుకున్నారంటూ, నెల్లూరులోని జిల్లా టిడిపి కార్యాలయంలో నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. టిడిపి నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, పట్టిసీమపై వైఎస్సార్సీపి నాయకులు లేనిపోని రాద్ధాంతం సృష్టించారని విమర్శించారు. పట్టిసీమ ప్రాజెక్ట్ నుంచి గోదావరి జలాలను కృష్ణానది మీదుగా రాలయసీమ జిల్లాలతో పాటు నెల్లూరుజిల్లాలోని పెన్నానదికి కూడా విడుదల చేయడంతో టిడిపి నాయకులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాళ్ళపాక అనూరాధ, రమేష్‌రెడ్డి, నరసింహారావు, ధర్మవరపు సుబ్బారావు, వైవి సుబ్బారావు, చిరంజీవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలు పంథా మార్చుకోవాలి

ఇటీవల 'లాయర్'లో మీడియా గురించి చేసిన వ్యాఖ్యలు అభినందనలు అందుకుంటోంది. ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. నిష్పాక్షికతకు, నిజాయితీకి, నిర్భీతికి, నిర్మొహమాటానికి నిలువుటద్దంగా నిలిచిన 'లాయర్' వ్యవస్థాపకులు దివంగత తుంగా రాజగోపాలరెడ్డి గారి ఒరవడినే మీరూ అనుసరిస్తున్నందుకు మీకు నా ధన్యవాదాలు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలవాల్సిన పత్రికలు, ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ప్రభుత్వాధిపతుల మెప్పు కోసం సమాజశ్రేయస్సుకు భంగం కలిగిస్తున్నాయి. పత్రికలకు మీరు హితవు చెప్పారు. తప్పులను సుతిమెత్తగా ఎత్తిచూపారు. అయినా వారు పాటిస్తారా? పంథా మార్చు కుంటారా? ఎవరి స్వార్థం వారిది.

**జయరామరెడ్డి, గుండవోల్.**

## తల్లిదండ్రుల ఆవేదన

పాఠశాలలు అలా ప్రారంభించారో లేదో అనాథపిల్లలకని, అంధవిద్యార్థులకని పిల్లల వద్ద డబ్బులు దండుతున్నారు. స్కూల్స్ యాజమాన్యాల ఒత్తిడితో చిన్నారులు ఇళ్లకొచ్చి తల్లిదండ్రులను డబ్బులివ్వమని ప్రాధేయపడుతున్నారు. ఏవైనా సేవా కార్యక్రమాలు చేయాలంటే యాజమాన్యాలే చొరవ చూపాలి. లక్షలు ఫీజులు దండుతూ ఆ మాత్రం సమాజానికి సేవ చేయలేరా? చందాల కోసం కొన్ని స్కూల్స్ వారు విద్యార్థులను రోడ్ల మీద తిప్పుతున్నారు. ఇది కూడా మంచిది కాదు.

**సింహపురి తల్లిదండ్రులు, నెల్లూరు.**

## మోటారుబైక్‌లలో త్రిబుల్స్

నెల్లూరు నగరంలో చాలామంది వాహనదార్లు వేగపరిమితిని పాటించడం లేదు. కొంతమంది యువకులు, యువతులు కూడా మోటారుబైక్‌ల మీద ముగ్గురు కలసి వేగపరిమితిని దాటి పయనిస్తూ నివాసిత ప్రాంతాల్లో పాదచారులను భయ పెడుతున్నారు. అంతేగాక మోటార్‌బైక్‌ల మీద కొంతమంది అల్లరికి అలవాటుపడిన యువకులు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. చాలామంది ట్రాఫిక్ నిబంధనలను పాటించుట లేదు. అలాగే కొన్ని ఆటోలలో కెపాసిటీని మించి ప్రయాణికులను ఎక్కించుకొని వేగపరిమితిని పాటించుట లేదు. కొంతమంది మైనర్లు కూడా మోటార్ బైక్‌లను నడుపుతున్నారు. కనుక తత్సంబంధిత శాఖల వారు ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాము.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**




## అనవసరమైన పనులు

చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఏమి అవసరమో ఆ పనులు చేయడం లేదు. తనకు అవసరమైనవి, జనానికి అనవసరమైనవి మాత్రమే చేస్తున్నారు. సింగపూర్ లాంటి రాజధానిని ప్రజలేమన్నా కోరారా? పంటలు పండే భూములను నాశనం చేస్తూ రాజధాని కట్టడమెందుకో? పుష్కరాలకు, పట్టిసీమకు పెట్టిన డబ్బుతో పోలవరం ప్రాజెక్ట్ పూర్తై ఉండేది. చంద్రబాబు పాలన బిల్డప్ ఎక్కువ, బిజినెస్ తక్కువ అన్నట్లుగా వుంది.

**- శ్రీరాజ్, నెల్లూరు.**

## త్యాగధనుల పోరాట ఫలమే..

# స్వతంత్ర భారతం

### - రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరుజిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలని రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. 15వ తేదీ నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల పోరాటం, కృషి వల్ల స్వాతంత్ర్యం లభించిందన్నారు. సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ జిల్లాలో ఉండటం గర్వకారణమన్నారు. రాబోయే ఐదేళ్లలో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో 19మెగా ప్రాజెక్టులు రూ.27,085కోట్ల పెట్టుబడులతో స్థాపించారన్నారు. ప్రాజెక్టుల ద్వారా 36వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. జిల్లాలో 49 భారీపరిశ్రమలు రూ.1.371కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ. 11.92కోట్లు విలువైన పరికరాలను సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. ఇందిరా ఆవాసయోజన ద్వారా 2015-16 సంవత్సరానికి 5,389గృహాలు కేటాయించారన్నారు. ఎంపీలు, కలెక్టర్ దత్తత తీసుకున్న 4గ్రామాల్లో 702గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. గిరిపుత్రిక కల్యాణ పథకం ద్వారా వివాహ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.50వేలు అందజేస్తున్నామన్నారు. 3,774 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1.24లక్షల మంది పిల్లలకు, 27వేల మంది గర్భిణులకు, 24వేల మంది బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. 3015మంది ఎస్సీలకు రూ.28.31కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.జానకి, జిల్లా ఎస్పీ గజరావు భూపాల్, జేసీ ఇంతియాజ్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, వెంకటగిరి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.



### ఐసిడిఎస్ శకటానికి ప్రథమ స్థానం

నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో 15వ తేదీ జరిగిన 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు. ఐసిడిఎస్ శకటానికి ప్రథమస్థానం దక్కింది. మహిళా సంక్షేమశాఖ, వ్యవసాయశాఖలకు రెండవ స్థానం, ఎస్సీ కార్పొరేషన్, ఐటిడిఏ శకటాలు మూడవస్థానం సాధించుకున్నాయి.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా 15వ తేదీ సాయంత్రం నెల్లూరు శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళా క్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల, గురుకృప కళాక్షేత్రం, మైథిలీ ఇంగ్లీషు మీడియం స్కూలు, కళాదీప్తి డ్యాన్సు ఇన్‌స్టిట్యూట్, ప్రగతి మహా విద్యాలయ, శ్రీ విఘ్నేశ్వర నృత్యనికేతన్, సంస్కృతి తరంగాలు, డాక్టర్ సి.వి.రామన్ ఇంగ్లీష్ మీడియం స్కూలు, భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం, ఏసి నగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, త్రివేణి క్లాసికల్ డ్యాన్సు అకాడమి, శ్రీ గురుదత్త కళానిలయం, విజయ్ మ్యూజికల్ డ్యాన్సు అకాడమికి చెందిన విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. జిల్లా సాంస్కృతిక మండలి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఏజేసీ రాజ్‌కుమార్, మైథిలి పాఠశాల కరెస్పాండెంట్ మనోహర్ రెడ్డి, భూగర్భ జల శాఖ అధికారి రమేష్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



# కోచింగ్ సెంటరా...? సూసైడ్ సెంటరా?

### --------- 'నారాయణ'పై అనిల్ ధ్వజం ---------



రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఛైర్మెన్‌గా వున్న నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల ఆత్మహత్యా కేంద్రాలుగా మారుతున్నాయని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తారు. 18వ తేదీ నెల్లూరులో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ మంత్రి అయ్యాక ఇప్పటివరకు ఆయన విద్యాసంస్థల్లో 11మంది చనిపోయారని, నారాయణ మంత్రి కావడం వల్లే ఆయన కాలేజీలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జరిగిన ఈ దారుణాలపై న్యాయవిచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహించి నారాయణ మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుండి రాష్ట్రంలో ఆకలికేకలు, చావు కేకలు ఎక్కువయ్యాయని ఎద్దేవా చేశారు. ఈ నెల 29న ప్రత్యేకహోదా కోసం వైయస్సార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు నాగరాజు, ఓబిలి రవిచంద్ర, దేవరకొండ అశోక్, మాధవయ్య, ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### • మళ్లీ మొదటికొచ్చింది

# ప్రసన్న రాజీనామా చేసాడు?



*నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష పదవి పెద్ద గుదిబండగానే ఉన్నట్లుంది. దానిని వదిలించుకోవడానికే ఆయన మొదట్నుండి ప్రయత్నిస్తున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి మళ్ళీ రాజీనామా చేసాడు. అయితే పార్టీని వదిలిపోను, జగన్‌ను ముఖ్యమంత్రి సీట్లో చూసేదాకా నిద్రపోనని పంతం పట్టాడు.*

అధికారపార్టీ అధ్యక్ష పదవులు మెత్తటి కుర్చీల్లాంటివి. కూర్చుంటే హాయిగా ఉంటుంది. అదే ప్రతిపక్ష అధ్యక్ష పదవి అయితే ముళ్ల కుర్చీలాంటిది. ముళ్ల మీద కూర్చున్నట్లే ఉంటుంది. ఇప్పుడు వైకాపా జిల్లా అధ్యక్ష పదవి కూడా అలాంటిదే! ఈ పదవిని తీసుకోవడమంటే పాడిఆవును అమ్ముకుని తెల్ల ఏనుగును కొనుక్కోవడమే. ముఖ్యంగా అధ్యక్ష పదవిలో ఆర్థిక కష్టాలు ఎక్కువ. పార్టీ తరపున బంద్‌లు చేయాలన్నా, రాస్తారోకోలు నిర్వహించాలన్నా సభలు, సమావేశాలు పెట్టాలన్నా డబ్బు ఖర్చుతో కూడుకున్న పని. పార్టీ కార్యకర్తలు కూడా దినసరి కూలీ ఇవ్వనిదే ధర్నాలకు రాని పరిస్థితి. ఇక పార్టీ ఆఫీసు అద్దె, కరెంటు బిల్లులు, కాఫీ, టీ ఖర్చులు... ప్రతి నెలా ఇవన్నీ తడిసి మోపెడవుతుంటాయి. ఈ భారాన్ని మోయలేకే ప్రసన్న కొద్దిరోజుల క్రితమే అధ్యక్ష పదవికి రాజీనామా చేసాడు. జిల్లా పార్టీ కార్యాలయాన్ని కూడా ఖాళీ చేసేసాడు. అయితే జగన్ కలుగజేసుకుని నచ్చజెప్పి రాజీనామా ఆలోచనను మాన్పించాడు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులు జిల్లా పార్టీ కార్యాలయానికి వెళ్లాలని, పార్టీ కార్యక్రమాలు సమిష్టిగా నిర్వహించాలని అందరికీ చెప్పి ప్రసన్నను శాంతింపజేశాడు. అది జరిగాక ఇంతవరకు జిల్లా పార్టీ కార్యాలయం ఏర్పాటు కాలేదు. ఈలోపు ఏమైందో ఏమోగాని ప్రసన్న రాజీనామా లేఖను విజయసాయిరెడ్డికి పంపించేసాడు. ఇక ఆయన రాజీనామా నిర్ణయం నుండి వెనక్కి రాకపోవచ్చు. జగన్ కూడా ఇక బుజ్జగించే ప్రయత్నాలు చేయకపోవచ్చు.






# వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సన్మానం

నెల్లూరు ఏసి స్టేడియంలో తొమ్మిదిరోజుల పాటు శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు వైభవంగా నిర్వహించిన ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని 15వ తేదీ నారా లోకేష్ సేవా సమితి అధ్యక్షుడు పాశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇందుకు స్పందించిన వేమిరెడ్డి... నెల్లూరుజిల్లా ప్రజలకు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సేవలను ప్రత్యక్షంగా చూపించాలన్న సంకల్పంతో టిటిడి వారి సహకారంతో వైభవోత్సవాలను ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షుడు పాముల రమణయ్య, మురళీ ఆర్ట్స్ అధినేత శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, అర్బన్‌సిటీ సభ్యులు పాముల హరిప్రసాద్, పరదేశి రఘు, పాశం వెంకటేష్, పట్రంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రకులాల నిరుపేదలకు రిజర్వేషన్ కల్పించాలి

----------------------- టంగుటూరి రామకృష్ణ

అగ్ర కులాల్లో వున్న నిరుపేదలకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ అన్నారు. 15వ తేదీ నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కనవున్న యష్‌పార్క్ హోటల్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ అగ్రకులాల్లో చాలామంది చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారని, బాగా చదివి ఎక్కువ మార్కులు సాధిస్తున్నా, రిజర్వేషన్ లేకపోవడంతో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు రావడం లేదన్నారు. ప్రతిభ వున్నా ప్రగతి లేకుండా ఉంటోందని, మెరిట్ ప్రాతిపదికన ప్రోత్స హించాలన్నారు. రోటరీ, లయన్స్‌క్లబ్‌ల ద్వారా ఎన్నో వైద్య శిబిరాలను నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కోట గురుబ్రహ్మం, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు కె.వి.చలమయ్య, ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు

సెప్టెంబరు 5వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఇస్కాన్ మందిరంలో శ్రీ రాధాకృష్ణుల ఊంజల్ సేవ, ప్రతిరోజూ సాయంత్రం 7.30 గంటలకు భజన కార్యక్రమంలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేస్తామని మందిర నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, ఆగస్టు 29న శ్రీ బలరామ జయంతి సందర్భంగా, ఆ రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల దాకా భజనలు, శ్రీకృష్ణ, బలరాముల మూర్తులకు అభిషేకం, భాగవత సత్సంగం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీ రాధా కృష్ణులకు అభిషేక మహోత్సవాలు కన్నులపండువగా నిర్వహిస్తామని, సాయంత్రం 6 గంటల నుంచి భజన కీర్తనలు, అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతి ప్రదానోత్సవం వుంటాయన్నారు. రాత్రి 8-30 గంటలకు పూజ్యశ్రీ సుకదేవస్వామివారి ఆధ్యాత్మిక ప్రవచనం వుంటుందని, 9.30 గంటలకు శ్రీ రాధాకృష్ణులకు అభిషేక మహోత్సవం వుంటుందని తెలిపారు. రాత్రి 12 గంటలకు స్వామివారికి మహా హారతి, 108 వంటకాల నివేదన, అనంతరం శ్రీకృష్ణ జన్మాష్టమి మహాప్రసాద వితరణ వుంటాయన్నారు.

# ఇఓకు అభినందనలు



నెల్లూరు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఇఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డిని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ యం.జానకి అవార్డుతో సత్కరించారు. రాజగోపురం పునర్నిర్మాణం, పొట్టేపాళెం, కొండ్లపూడిలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానాల ప్రగతికి శ్రీనివాసులురెడ్డి విశేషకృషి చేసినందుకుగాను ఈ అవార్డును అందజేశారు. ఈమేరకు ట్రస్టు బోర్డు మాజీసభ్యులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# నగరంలో స్పీకర్ టీం

నెల్లూరులో 18, 19తేదీలలో కొంత రాజకీయ సందడి కనిపించింది. స్పీకర్ కోడెల శివప్రసాద్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మెన్ సతీష్‌రెడ్డిల నేతృత్వంలో మంత్రి అయ్యన్నపాత్రుడితో పాటు తెలుగుదేశం, సిపిఎంలకు చెందిన 52మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కృష్ణపట్నంపోర్టు సందర్శనకు నెల్లూరొచ్చారు. నగరంలోని అతిథిగృహాలు, వివిధ హోటళ్లలో వీరికి బస ఏర్పాటు చేశారు. వీరందరికీ 18వ తేదీ ఉదయం అల్లీ పురంలోని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అనంతరం ఈ బృందం కృష్ణపట్నం పోర్టును, జెన్‌కో థర్మల్ కేంద్రాలను సందర్శించింది. రాత్రి నెల్లూరులోని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇంట్లో విందు ఏర్పాటు చేశారు. 19వ తేదీ ఉదయం ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ఇంట్లో అల్పాహార విందు జరిగింది. ఈ బృందం జరిపిన అధికారిక పర్యటన కంటే విందుల ప్రోగ్రామే పెద్దదైంది. వైకాపా వాళ్లు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించారు.

## నెల్లూరు కబుర్లు

# రంగనాథ ఆలయం ఇ.ఓగా శ్రీనివాసులురెడ్డి



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పోరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ఇఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రంగనాథస్వామి దేవస్థానం అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న దేవాదాయశాఖ సహాయకమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డిని అక్కడ నుండి రిలీవ్ చేసి సూళ్లూరు పేట చెంగాళమ్మ దేవస్థానంకు కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిం చారు. దేవాదాయశాఖలో భారీగా బదిలీలు ఉంటాయనుకున్నప్పటికి జిల్లాలో ఈ రెండు బదిలీలే చోటుచేసుకోవడం విశేషం.

# వికలాంగ విద్యార్థినులకు అన్నదానం



ప్రముఖ పారిశ్రామికవేత్త, భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా బలరామిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 16న పొదలకూరు రోడ్డులో వున్న ప్రభుత్వ బాలికల వికలాంగ ఆశ్రమంలోని విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసి, వారందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కళాబంధు' కొండా బలరామిరెడ్డి మాట్లాడుతూ, తన జన్మదినోత్సవాన్ని చిన్నారుల సమక్షంలో జరుపుకోవడం ఎంతో ఆనందకరంగా వుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజాభ్యున్నతికి తమవంతు సేవలందించాలని, మానవసేవ-మాధవ సేవతో జీవితాలను సార్థకం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవి ఆటోమొబైల్స్ ఇ.డి కొండా నిరంజన్‌రెడ్డి, జి.ఎం రవికుమార్, కొండా కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కృష్ణమూర్తి

నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావుపై బదిలీ వేటు పడింది. ఆయనను కర్నూలు మెడికల్ కాలేజీకి ప్రొఫెసర్‌గా బదిలీ చేసారు. నెల్లూరు కాలేజీకి ఇక్కడే మత్తు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తిశాస్త్రిని కొత్త ప్రిన్సిపాల్‌గా నియమించారు. ప్రభాకర్‌రావు ఇక్కడకు ప్రిన్సిపాల్‌గా వచ్చి సంవత్సరంపైనే అయ్యింది. గత కొన్ని నెలలుగా కాలేజీ విషయంలో అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. మొన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో అనేక అవకతవకలు బయటపడ్డాయి. అప్పుడే మంత్రికి మండి ప్రిన్సిపాల్‌ను రిలీవ్ చేయాలని ఆదేశించారు. మంత్రి తనిఖీ ఫలితమే ఈ బదిలీ!

# ఎక్సైజ్ సూపరింటెండెంట్ల బదిలీ

నెల్లూరుజిల్లాలోని నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు ఎక్సైజ్ సూపరింటెండెంటుగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎక్సైజ్ సూపరిం టెండెంట్‌గా నియమించారు. కాకినాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బల రామకృష్ణను నెల్లూరు ఎక్సైజ్ సూపరింటెండెంటుగా నియమించారు. నరసారావుపేట ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న చెన్నకేశవరావును నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సుబ్బారావును నరసారావుపేట సూపరింటెండెంట్‌గా, ఆయన స్థానంలో భీమవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న మధుసూదనరావును నియమించారు.

# వై.వి.సుబ్బారెడ్డికి నెల్లూరు బాధ్యతలు



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు జిల్లా పరిశీలకులుగా ఒంగోలు పార్ల మెంట్ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డిని నియ మించారు. సుబ్బారెడ్డికి నెల్లూరుజిల్లా రాజకీయాలపై అవగాహన వుంది. జిల్లా పార్టీలో ఎమ్మెల్యేలకు, నాయకులకు సుబ్బా రెడ్డిపై గౌరవం వుంది. ఆయనతో ఇక్కడి నాయకులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జిల్లా పరిశీలకుడిగా సుబ్బారెడ్డిని నియమించడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఋణాలకు ఇంకా గడువు

ఎస్సీ వ్యక్తిగత ఋణాల దరఖాస్తు గడువును ఈ నెల 31దాకా పెంచినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఇ.డి రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదట ఈ నెల 15వ తేదీ గడువిచ్చినప్పటికి, తగి నన్ని దరఖాస్తులు రాకపోవడంతో 31 దాకా పొడిగించినట్లు ఆయన తెలిపారు.

# 22న వాగ్గేయకార గానామృతం

భారతీ సంగీత విద్యాలయం ఆధ్వ ర్యంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌనుహాలులో తమ విద్యార్థులచే వాగ్గేయకార గానామృతం శాస్త్రీయ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు భారతీ సంగీత విద్యాలయం అధినేత్రి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విభావరికి వాయిద్య సహకారాన్ని వీణ పి.హేమలక్ష్మి, వయోలిన్ షణ్ముఖ్, మృదంగం శాంతి కళాధర్, కీబోర్డు సురభి సంగీత్‌సౌరభ్‌లు అందిస్తున్నట్లు తెలిపారు.

# 5న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి జీవిత సభ్యుల సమావేశం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు జిల్లా జీవిత సభ్యుల సాధారణ సమా వేశం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు, జేసీ ఇంతియాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జీవిత సభ్యులందరూ సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

# ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో కోటమిట్టలో వున్న శ్రీకృష్ణ దేవరాయ సెంటర్‌లోని జైభజరంగ్ వ్యాయామశాలలో ఆదివారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. సేవా భారతి జిల్లా కార్యదర్శి కోడూరు సత్యంతో పాటు డాక్టర్లు కిశోర్, ఎస్ చైతన్య పాల్గొని రోగు లను పరీక్షించారు. పాబోలు సతీష్ ఉచి తంగా మందులు పంపిణీచేశారు.



# రైల్వే ఓవర్ బ్రిడ్జికి మోక్షం

నెల్లూరుజిల్లా మనుబోలు మండల పరిధిలో వీరంపల్లి – మనుబోలు మార్గంలో రూ.28కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి కం ఎక్స్‌టెన్షన్ రోడ్డును కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ నెల 16వ తేదీన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి శిద్దా రాఘవ రావు, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డా॥ పి.నారాయణ, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రగతికి స'పోర్ట్'

రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివ ప్రసాద్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మెన్ వి.సతీష్‌రెడ్డిల నేతృత్వంలో మంత్రులు పి.నారాయణ, చింతకాయల అయ్యన్న పాత్రుడు, 29మంది ఎమ్మెల్యేలు, 23 మంది ఎమ్మెల్సీల బృందం 18వ తేదీ పారిశ్రామికాభివృద్ధి అధ్యయనంలో భాగంగా నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టును సందర్శించింది. పోర్టు యాజ మాన్యం ఈ బృందానికి ఘనంగా స్వాగత సత్కారాలు నిర్వహించింది. ఈ బృంద సభ్యులు మూడు ప్రత్యేక టగ్‌లలో కంద లేరులో విహరించారు. కండలేరు క్రీక్ ఇరువైపులా వున్న బెర్తులను, పోర్టు నిర్మాణాలను పరిశీలించారు. బెర్త్‌ల వద్ద స్టీమర్లు, వాటిలో ఎగుమతులు, దిగుమతుల తీరును కళ్లారా వీక్షించారు. కండలేరు సముద్రంలో కలిసే ముఖద్వారం వరకు వీరు పడవల్లో తిరిగారు. పోర్టులో ఏర్పాటు చేసిన సభలో పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్ కృష్ణపట్నం పోర్టు ప్రగతిని గురించి వివరించారు. పోర్టులు ప్రగతికి మూల స్థంభాలని, రాష్ట్రాభివృద్ధిలో పోర్టులు ప్రధాన పాత్ర పోషించనున్నాయని, స్పీకర్, మంత్రులు తమ ప్రసంగాలలో పేర్కొ న్నారు. ఈ సందర్భంగా పోర్టులో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి, దివంగత మహ నీయులు అబ్దుల్ కలాం విగ్రహాన్ని స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆవిష్కరించారు.









# ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సిఐడి దర్యాప్తు చేపట్టాలి

## - ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డిమాండ్



నెల్లూరు నగరంలో వందల కోట్ల రూపాయల విలువజేసే ప్రభుత్వ భూము లను కబ్జాదారులు ఆక్రమించుకుంటు న్నారని, ఈ దురాక్రమణలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సిఐడి దర్యాప్తు చేపట్టి, ఆక్రమణదారుల ఆట కట్టించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ నెల 16న నెల్లూరులోని వైఎస్సా ర్సీపి రూరల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని గోమతినగర్‌లో కోట్లాది రూపాయల విలువజేసే ప్రభుత్వ పార్కు స్థలాన్ని కొందరు కబ్జాచేశారని, నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకులో తాకట్టు పెట్టి, విక్రయించిన సంఘటనలు ఆక్రమణలకు నిదర్శనమన్నారు. అదే విధంగా, ఇస్కాన్ సిటీలో ఇటీవల రూ. 10 కోట్ల విలువైన పార్కు స్థలం కబ్జాకు గురైందని, అక్రమార్కుల వివరాలను, సంబంధిత రికార్డులను సేకరించి కార్పొ రేషన్ అధికారులకు అందజేశామని అన్నారు. ఆక్రమణలకు సంబంధించి పాత్రధారులతోపాటు, అందుకు మూల కారణమైన సూత్రధారులను కూడా గుర్తించి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలను అందరం పరిరక్షించు కోవాలని, భవిష్యత్‌లో ప్రజా వసరాలకు అవి ఎంతగానో ఉపయోగ పడతాయని ఆయన అన్నారు. కబ్జా దారులు ప్రభుత్వ స్థలాల జోలికి రాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకున్నప్పుడే ఆ స్థలాలను మనం పరిరక్షించుకోగల మన్నారు.



ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# ఇస్కాన్‌లో సందడి చేసిన చిన్నికృష్ణులు



చిన్నికృష్ణుల బుడిబుడి నడకలతో, ముద్దుమాటలతో ఆ ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. ముచ్చటైన ఆ ముద్దుకృష్ణుని వేషధారణలతో చిన్నారులు ఆ ప్రాంతా న్నంతా కనువిందు చేశారు. సెప్టెంబరు 5వ తేదీన అత్యంత వైభవంగా జరుగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని, నెల్లూరు నగరంలో వున్న అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం వారి ఆధ్వర్యంలో ఇస్కాన్ మందిరం నిర్వాహకులు చిన్నారులకు ఈ నెల 16న నిర్వహించిన శ్రీకృష్ణుని వేషధారణ పోటీల్లో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలతో తరలిరావడంతో ఇస్కాన్ మందిరం కృష్ణకళతో కళకళలాడింది. శ్రీకృష్ణునితో పాటు, రుక్మిణి, గోపికల వేషధారణలతో చిన్నారులు మందిరా నికి విచ్చేసి అందరికీ ఆనందాన్ని కలిగించారు. ఈ వేషధారణ లతో పిల్లల్లో భక్తిభావం ఉప్పొంగుతుందని, అంతేకాక ఈ వేషధారణల పోటీలతో పాటు, చిన్నారులకు పాటల పోటీలు, చిత్రలేఖనం, రంగులు వేయడం తదితర అంశాల్లో నిర్వహించిన పోటీలు చిన్నారుల్లో ప్రతిభకు మరింత మెరుగులు దిద్దేవిధంగా వున్నాయంటూ ఈ వేడుకల సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో పాల్గొన్న నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

అనంతరం నిర్వాహకులు ఈ పోటీల్లో విజేతలైన వారి పేర్లను ప్రకటించారు. వేషధారణ పోటీల్లో (గ్రూప్–1 విభాగం) వరుసగా కార్తీక్, జైదీప్, రుషిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా, గ్రూప్–2 విభాగంలో నిత్యప్రణీత్, సహస్ర, జి.యువన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. గీతాలాపన పోటీల్లో బి. భార్గవి, జైదీప్, రుషిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించగా, చిత్రలేఖన పోటీల్లో వరుసగా టి.విఘ్నేశ్వరి, డి.సిద్ధార్థరిషి, అంకితమిత్రా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. రంగులు వేయడంలో చిన్నా రులు ఆర్.భవిత, డి.బాలాదిత్య, ఎం.వంశీకృష్ణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరితోపాటు, ప్రతి విభాగంలోనూ ముగ్గురు వంతున ఎంపికచేసి ప్రోత్సాహక బహుమతులను కూడా అందివ్వనున్నారు. వీరందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమినాడు బహుమతులను అందజేస్తామని ఇస్కాన్ మందిరం నిర్వాహకులు శ్రీ సుకదేవస్వామి తెలియజేశారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# గూడూరులో మువ్వన్నెల జెండా రెపరెపలు

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో 15వ తేదీ 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. ముందుగా జాతీయ జెండాను ఎగరవేసి వందనం చేశారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సబ్‌కలెక్టర్ పిఎస్ గిరీషా మాట్లాడుతూ డివిజన్ పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి సందేశాలు అందరినీ అలరించాయి. అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన అందరినీ ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బి.శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, గూడూరు తహశీల్దార్ పి.వెంకటనారాయణమ్మ, సబ్‌కలెక్టర్ ఆఫీసు ఏవో గీతావాణి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. కాగా గూడూరు సబ్‌జైలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్, ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాల, డిఆర్‌డబ్ల్యు కళాశాల, డీఎస్పీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, రోటరీ, లయన్స్‌క్లబ్, రైల్వేస్టేషన్‌లలో జాతీయ జెండాను ఎగురవేశారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్, సబ్‌కలెక్టర్ గిరీషా, డీఎస్పీ బి.శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ దేవసేన తదితరులు

# గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే సునీల్ కుమార్



గూడూరు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు మండల పరిధిలో చెంబేడిపాలెంలో ఎన్ఆర్‌పి.రమణయ్య ఆధ్వర్యంలో అపోలో వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపి, ఎంపీపీ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పుట్టిన ఊరిని మరచిపోకుండా రమణయ్య దత్తత తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం రోగులకు వైద్యులు పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బి.శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు పద్మ, మాజీఎంపీపీ మల్లు విజయకుమార్‌రెడ్డి, వాటంబేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంతీయ వైద్యశాలలో నీటిశుద్ధి యంత్రం



గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో రూ.1.5లక్షలు విలువ చేసే నీటిశుద్ధి యంత్రాలను రెండు చోట్ల ఏర్పాటు చేశారు. 14వతేదీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ గిరీషా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో గతంలోనూ అనేక సేవా కార్యక్రమాలు ట్రస్టు ద్వారా చేపట్టారని, పట్టణంలోనే కాకుండా నియోజకవర్గంలోనూ ఈ తరహా సేవలు అందించాలని కోరారు. సబ్‌కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ మొదటగా ఆసుపత్రిలో పరిశీలిస్తే తాగునీటి సమస్య ఉండటంతో ఫోన్లో దాత హరిశ్చంద్రారెడ్డిని కోరగా వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పి మూడురోజుల్లో నీటిశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దాత హరిశ్చంద్రారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజా, ట్రస్టు ప్రతినిధులు కె.మునిగిరీష్, ఆదినారాయణరెడ్డి, శ్యాం, మునిభాస్కర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 15వ తేదీ నెల్లూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మంత్రి పి.నారాయణ నుండి ఉత్తమ సేవాపత్రాన్ని అందుకుంటున్న గూడూరు తహశీల్దార్ వెంకట నారాయణమ్మ

# అక్రమ మద్యం దుకాణాలపై కఠిన చర్యలు

## - మధుసూదనరావు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు తెలిపారు. గూడూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. మద్యం దుకాణాల్లో విక్రయాలు ఎమ్మార్పీ ధరలకు జరగాలని, బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాలకు ఆదాయం పెంచే దిశగా కృషి చేస్తామన్నారు. పలువురు సిఐలు ఆయన్ను కలసి పరిచయం చేసుకొన్నారు.

# భూసమస్యలపై వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినంలో సబ్‌కలెక్టర్ గిరీషాకు ప్రజలు పలు సమస్యలను పరిష్కరించాలని వినతులు అందజేశారు. చిల్లకూరు మండలం కడివేడు వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించకుండా బినామీదారులకు కొమ్ము కాస్తున్నారని, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి పూర్తిగా గండికొట్టి అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు పలికారు. డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన రైతులు తమ భూములు ఆక్రమించుకొన్నారని, పట్టాలు ఇచ్చారే తప్ప, భూములు చూపలేదని, పింఛన్లు మంజూరు చేయాలని, నివేశస్థలాలు ఇవ్వాలని ఫిర్యాదులు చేశారు. ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ఎక్కువగా భూ సమస్యలు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

# శ్రీకాళహస్తిలో వేడుకగా పంద్రాగస్టు

శ్రీకాళహస్తిలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని 15వతేదీ ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇ.ఇ. రామిరెడ్డి, పి.ఆర్.ఓ. హరిబాబు, ఎపిఆర్ఓ నాగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వేచ్ఛను దుర్వినియోగం చేయకూడదన్నారు. నాటి పెద్దలు చేసిన పోరాటాలను గుర్తు చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య ఫలాన్ని అందరికీ సమానంగా దక్కేటట్లు చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రమోహన్ జెండా ఆవిష్కరించారు. స్కిట్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్రయ్య జెండా ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో వైస్ చైర్మన్ సారధి, జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీరామశర్మ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సతీమణి బొజ్జల బృందమ్మ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాధారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, టి.డి.పి. నాయకులు పాల్గొన్నారు. బేరివారి మండపం వద్ద కోలా ఆనంద్ జెండాను ఆవిష్కరించారు.



# శ్రీకాళహస్తి న్యూస్

# దేశ సౌభాగ్యమే లక్ష్యం

## - ఇస్లాం సనాతన సభల్లో వక్తలు

దేశంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతోనే చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ఈదులగుంట ఈద్గాలో శని, ఆదివారాలలో సనాతన మహాసభలు నిర్వహించామని ఇస్లాం మతపెద్ద గురువులు హితవు పలికారు. తాము ఎంచుకున్న మార్గంలో నడవడమే మతమని పెద్దలు తెలియచేశారు. ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ సనాతన మహాసభలకు ఆంధ్రా, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ఇస్లాం మత పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు పదెకరాల విస్తీర్ణంలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముఫ్తి హాజీ అబ్దుల్ వహాబ్‌సాహెబ్, శ్రీకాళహస్తికి చెందిన ముఫ్తి నయిం సాహెబ్ పర్యవేక్షణలో ధార్మిక సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతగురువులు మాట్లాడుతూ ఇస్లాం మత వ్యాప్తికి మహనీయులు, ప్రవక్తలు ఆచరించిన సిద్ధాంతాలను విస్తృతంగా దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ఇస్తిమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేడు మనం మానవ జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక ఇహలోకంలోని ప్రలోభాలకు లోనవుతూ జీవిత పరమార్థాన్ని విస్మరిస్తున్నామని అన్నారు. రెండు రోజులు జరిగిన ఇస్తిమాకు శ్రీకాళహస్తిలోని 13 మసీదులకు చెందిన వారు సహకరించారు. ఓ వైపు ఆధ్యాత్మిక ప్రసంగాలు, మరోవైపు దైవమార్గంలో వెళ్లే జమాత్‌లతో మైదానం కళకళలా డింది. అన్ని శాఖాధికారులు తమ సహకారం అందించారు.

శ్రీను గల్పిక

# ప్రత్యేకహోదాపై కాంగ్రెస్ మార్క్ లాజిక్

దేశ రాజధాని ఢిల్లీ నగరం. టెన్‌జనపథ్. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీ, చిదంబరం, ఏ.కె.ఆంటోని, గులాంనబీ ఆజాద్, దిగ్విజయ్‌సింగ్, మల్లిఖార్జునఖర్గే, సుశీల్ కుమార్‌షిండే వంటి నాయకులంతా ఉన్నారు. అందరి ముఖాలలో ఆనందం వెల్లివిరుస్తుంది. అక్కడంతా పండుగ వాతావరణం వుంది. సోనియాగాంధీ కాంగ్రెస్ ఎంపీలందరితో కరచాలనం చేస్తూ ఒక్కొక్కరిని అభినందించసాగింది. పార్లమెంటులో బ్రహ్మాండంగా పనిచేసారంటూ ఎంపీలందరికీ తలా ఒక గిఫ్ట్‌ప్యాక్ ఇచ్చింది. రాహుల్‌గాంధీ అమాయకంగా... పార్లమెంటులో మన ఎంపీలు ఏ పనీ చేయలేదు కదమ్మా, పార్లమెంటు సమావేశాలు జరిగిన అన్నిరోజులూ మనం చేసింది గలభానే కదా, ఒక్క సమస్య మీద కూడా చర్చించలేదు కదా, మరెందుకు ఎంపీలకు గిఫ్ట్‌లిచ్చి మరీ అభినందిస్తున్నావని అడిగాడు. అప్పుడు సోనియా... రాహుల్ నువ్వింకా ఎదగాలి నాయనా... ఎదగాల్సింది ఎత్తులో కాదు(వేలితో తలను తడుతూ) బ్రెయిన్‌లో... పార్లమెంటు సమావేశాలు సజా వుగా జరిగితే ఏమొస్తుంది తొక్క... ప్రభుత్వాలు బిల్లులు పాస్ చేసుకుంటాయి. మొన్న ఒకరోజు సభ సవ్యంగా నడిస్తే చూసావుగా ఏం జరిగిందో. ఆ సుష్మాస్వరాజ్ మీ ముత్తాత, నాయనమ్మల దగ్గర నుండి నీ దాకా అందరినీ కడిగేసింది. సభను సజావుగా జరగనిచ్చి వాళ్ల చేత మాటలు పడాల్సిన అవసరం మనకేంటి చెప్పు. భారతదేశ రాజకీయాలలో మంచి ప్రభుత్వం, దానికంటే మంచి ప్రభుత్వం అనే ఫీలింగ్ ఎప్పుడూ రాకూడదు. పనికిమాలిన ప్రభుత్వం, దానికంటే పనికిమాలిన ప్రభుత్వం అనే అభిప్రాయమే రావాలి. మన యూపిఏ ప్రభుత్వాన్ని చెత్త ప్రభుత్వమనే మొన్న ఎన్నికల్లో ప్రజలు దించేసారు. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వాన్ని మనకంటే చెత్త ప్రభుత్వమనిపించాలి. అప్పుడే ప్రజల్లో వీళ్లకంటే ఆ కాంగ్రెస్ వాళ్లే నయమనే భావన వస్తుంది. టోటల్‌గా ఈ దేశ ప్రజలెప్పుడు కూడా 'ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకోవడానికి' అనే సిస్టంలో బ్రతుకుతుంటారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏ పనీ చేయకుంటేనే మనకు భవిష్యత్ ఉంటుంది. భూసేకరణ బిల్లు, జిఎస్‌టి బిల్లు తయారు చేసింది మనమే. ఈరోజు వాటిని అడ్డుకుంటున్నదీ మనమే. మన హయాంలో జరిగిన 2జీ స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్, కోల్‌గేట్‌లతో పోలిస్తే ఈ లలిత్‌గేట్ పెద్ద స్కాం కాదు... కాని ఈ లలిత్‌గేట్‌నే అడ్డం పెట్టుకుని అసలు పార్లమెంటు సమావేశాలే జరగక్కుండా చేసాం చూడు. అదే కాంగ్రెస్‌పార్టీ టాలెంట్ అంటే. మొదటి నుండి మనది ఒకటే పాలసీ... మనం పనిచేయం... ఇంకొకరిని పనిచేయనివ్వం. దీంట్లో మనం సక్సెస్ అవుతుండబట్టే అప్పుడప్పుడు తప్ప ఎప్పుడూ అధికారంలో వుండగలుగుతున్నాం. అదే కాంగ్రెస్ రాజకీయ మహిమ అని చెప్పింది. ఆ సమయంలో తన తల్లి రాహుల్‌గాంధీకి గీతను బోధించిన మహిళా కృష్ణుడిలా కనిపించింది. వెంటనే అతను తల్లీ... నీలో ఇంత రాజకీయ జ్ఞానం వుందని తెలియక నేను అజ్ఞానంతో విజ్ఞానం తెలుకోవడానికి నెలల కాలాలపాటూ సెలవులు పెట్టి విదేశాలకు వెళ్తున్నాను, నా అజ్ఞానాన్ని మన్నించు... ఇక నుండి రాజకీయ పాఠాలు నీవద్దే నేర్చుకుంటానని చెప్పి... అమ్మా, ఈ పార్లమెంటు సమావేశాలను అడ్డుకోవడానికి సుష్మాస్వరాజ్, లలిత్‌మోడీ వంటి వాళ్లు దొరికారు. తర్వాత సమావేశాలను జరగకుండా చేయడానికి మనకున్న సబ్జెక్ట్ ఏంటని అడిగాడు. అది కూడా రెడీగా వుంది నాయనా, మన తదుపరి పోరాటం ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేకహోదా మీదనే! అని సోనియా అంది. దానికి రాహుల్ ఆశ్చర్యపోతూ... అదేంటి మమ్మీ, ఆంధ్రప్రదేశ్ మీద మనకు అంత అభిమానమే వుంటే విభజన బిల్లులోనే పెట్టి ఉండొచ్చు కదా... ఇప్పుడు దీనిమీద గొడవ చేయడమెందుకని రాహుల్ అడిగాడు. అప్పుడు మన్మోహన్‌సింగ్ స్పందిస్తూ... అదే బాబూ లాజిక్ అంటే. నాకు కొత్తల్లో కాంగ్రెస్ మార్క్ రాజకీయాలు బొత్తిగా అర్థమయ్యేవి కావు. కాని ప్రధానిగా పనిచేసిన పదేళ్లలో నాకు అంతా అర్ధమైపోయింది. పని చేయం, చేయనివ్వం అనేదే మన పాలసీ. ఈ పాలసీ మీద ఎంత కాలమైనా రాజకీయాలలో నడవొచ్చు. విభజన బిల్లులోనే ప్రత్యేకహోదా అంశం పెట్టేసామనుకో... ఇక సమస్య ఏముంది... ఎన్డీఏ వచ్చి దానిని అమలు పరిచేది. మనం బిల్లులో చేర్చలేదు కాబట్టి వాళ్లు దానిని అమలు చేయలేకున్నారు. ఇది మనకు మంచి అవకాశం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కావాలంటూ ఇప్పుడు మనం ఉద్యమాలు చేస్తాం, మొసలి కన్నీళ్లు కారుస్తాం, పార్లమెంటును స్థంభింపచేస్తాం. మన కార్యకర్తలు కొందరు ఒంటి మీద కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యలు చేసుకుంటారు. లేదంటే మనమే కిరోసిన్ పోసి నిప్పంటిస్తాం. ఈ అంశంతో ఇంకో రెండుమూడేళ్లు కేంద్రాన్ని ఏ పనీ చేయనీకుండా చేయొచ్చని చెప్పాడు. అది విని రాహుల్... అసలైన రాజకీయం అంటే ఏంటో నేర్పించారు. ఈ రాజకీయాలు తెలియక ఇంతవరకు నేను ఆర్డినెన్స్‌ను చించడం వంటి పిచ్చిపనులు చేసాను. నన్ను క్షమించండి అంటూ మన్మోహన్ సింగ్ ముందు చేతులు జోడించాడు.

★★★★★

హైదరాబాద్‌లో హైటెక్‌రత్న, పుష్కరప్రజ్ఞ చంద్రబాబు క్యాంప్ కార్యాలయం. మంత్రులు కె.ఇ.కృష్ణమూర్తి, చిన రాజప్ప, దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, పీతల సుజాత, నారాయణ సలహాదారుడు పరకాల ప్రభాకర్ ఉన్నారు. పత్తిపాటి పుల్లారావు వుండి... సార్, ప్రత్యేకహోదా మీద ప్రతిపక్షాలు మనల్ని ఉతికి ఆరేస్తున్నాయి, కేంద్రంతో ఇక తాడోపేడో తేల్చుకోవాల్సిందే, ప్రత్యేకహోదా రాకుంటే మేం జనంలో తిరిగే పరిస్థితి లేదు. ఆ జగన్ చూస్తే ప్రత్యేకహోదా కోసం ఢిల్లీలో ధర్నా చేస్తున్నాడు. రాష్ట్రాన్ని నిలువునా ముంచిన కాంగ్రెసోళ్లు కూడా ప్రత్యేకహోదా మీద ఆందోళనలు చేస్తున్నారు. మనమే అటూ ఇటూ కాకుండా పోతున్నామన్నాడు. ఆ మాటకు చంద్రబాబుకు కోపం వచ్చింది. ఆవేశంతో ఊగిపోతూ... ఇప్పుడే ఢిల్లీ వెళతాను... ప్రత్యేకహోదా మీద ఆ మోడీని కడిగేస్తాను, అవసరమైతే కేంద్రంతో యుద్ధానికి దిగుతాను... నా తడాఖా ఏంటో వారికి చూపిస్తాను అంటూ లేచాడు. మోడీని చంద్రబాబు నిలదీసి అడిగే అపురూపసంఘటనను కళ్ళారా చూసి ఆనందించాలనే తపనతో మంత్రులు కూడా ఆయన వెంట ఢిల్లీకి బయల్దేరారు.

★★★★★

అది ప్రధానమంత్రి కార్యాలయం. నరేంద్ర మోడీ తన గదిలో కూర్చుని ఉన్నాడు. చంద్రబాబు తన మంత్రులను బయటే ఉండమని చెప్పి ఆవేశంగా లోపలకు వెళ్లాడు. కాని లోపల తమ బాస్ ఆవేశంతో మాట్లాడే మాటలు వినాలి, ఆయన హావభావాలను చూడాలనే ఆత్రంతో మంత్రులు రహస్యంగా ఒక కిటికీవద్ద చేరి లోపలకు తొంగి చూడసాగారు. చంద్రబాబును చూడగానే మోడీ స్వాగతం పలికి కూర్చోమన్నాడు. చంద్రబాబు ఆవేశంగా... సార్, మా రాష్ట్రానికి ప్రత్యేకహోదా అంశాన్ని తేల్చండని అడిగాడు... వెంటనే మోడీ...అది సరేగాని 'ఓటు-నోటు' కేసు ఏమైంది చంద్రబాబుజీ అని అడిగాడు. దాంతో చంద్రబాబులో తీవ్ర నిరుత్సాహం అలుముకుని... మిమ్మల్ని వూరికే చూసిపోదామని వచ్చాను, ఇక వస్తాను అన్నాడు. ఇంతకుముందేంటో... ప్రత్యేకహోదా అన్న పదమేదో అన్నారు అని మోడీ అడిగాడు. అదేం లేదు మోడీజీ.. ఆ కాంగ్రెస్‌వాళ్లేదో మా రాష్ట్రానికి ప్రత్యేకహోదా డిమాండ్ చేస్తున్నారు, మీకు ఇష్టముంటే ఇవ్వండి, లేకుంటే లేదు అంటూ లేచాడు. అంతా చూస్తున్న తెలుగుమంత్రులు ఔరా... చంద్రబాబు అంటూ నోరెళ్లబెట్టారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అవసరాలకు డబ్బు సర్దుబాటైనను ఆర్థికముగా ఇబ్బందులు ఉంటాయి. వ్యాపారం జరిగే తీరు అసంతృప్తి కలిగిస్తుంది. వృత్తి పరంగా పెరుగుదల ఉంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలు కలుగుతుంటాయి. ఉద్యోగులు అప్రమత్తులై మెలగవలసి వుంటుంది. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. ఆర్థిక పరమైన పేచీలు పరిష్కారము చేసికొనడం మంచిది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపార జీవనం కలవారికి మంచి అభివృద్ధి, రాబడి ఉంటుంది. ఖర్చులు స్వల్పంగా పెరిగినా ఇబ్బంది లేదు. అనుకున్న పనులను పట్టుదలతో జరుపుకొంటారు. దూరప్రయాణాలు, శుభకార్యాలు ఖరారు కాగలవు. సాంకేతిక క్రీడా కళారంగాల వారికి అభివృద్ధి బాగుంటుంది. వృత్తి ఉద్యోగ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బాంధవ్యాలు గట్టిపడతాయి. ఖర్చుల పెరుగుదల భారమనిపించదు. కొత్త పథకాలతో వ్యాపారాల పెరుగుదలకు కృషి చేస్తారు. క్షేమ సమాచారాలు శుభవార్తలు బంధువుల నుండి తెలిసికొంటారు. పొగడ్తలు, ప్రలోభాలకు దూరంగా మెలగడం మంచిది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వస్తువు, డబ్బు పోగొట్టుకొనడం జరుగుతుంది. మంచి విద్యాప్రగతి ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయ ఖర్చులు ఫర్వాలేదు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము సామాన్యము. రావలసిన బాకీలు కొంత చేతికందుతాయి. ఆర్థిక వ్యవహారాలు జాగ్రత్తగా నడపవలసి వుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలకు మార్గాలు వెతుకుతారు. ఉద్యోగులకు పని వత్తిడి, స్థానమార్పులు ఉండవచ్చును. ఏ వ్యవహారాన్ని గాని కోప తాపాలు లేకుండా ప్రశాంతంగా జరపండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేపట్టిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. మీ సలహాలు, సూచనలు ఆమోదయోగ్యంగా అందరికీ ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. ముఖ్యమైన నోటీసులు పత్రాలు అందుకొంటారు. అనుకోని ఖర్చులు పైనబడే అవకాశమున్నది. విద్యార్థులకు ఇతర వ్యాపకాలు పెరిగి విద్యపై శ్రద్ధ తగ్గవచ్చును.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరగవచ్చును. వ్యాపార, ఉద్యోగులపై అధికారుల దాడులు, వత్తిడి ఉండవచ్చును. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. చేపట్టిన పనులు సరిగా జరగక టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, స్వల్ప లాభాలుంటాయి. కోర్టు కేసులందు కొంత అనుకూలత ఉంటుంది. బంధువుల రాకపోకలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 21.08.2015 నుండి
తేది. 27.08.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో కుజ శుక్రులు, సింహంలో రవి గురువులు, కన్యలో బుధరాహువులు, వృశ్చికంలో శని, తుల వృశ్చిక మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

గురుమౌఢ్యమి జరుగుచున్నది.

ముహూర్తములు లేవు.

**శ్రావణ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 21 | శుక్ర | షష్ఠి | ఉ॥ గం.6.04వ॥ |
| తేది. 22 | శని | సప్తమి | ఉ॥ గం.7.21వ॥ |
| తేది. 23 | ఆది | అష్టమి | ఉ॥ గం.8.10వ॥ |
| తేది. 24 | సోమ | నవమి | ఉ॥ గం.8.29వ॥ |
| తేది. 25 | మంగళ | దశమి | ఉ॥ గం.8.17వ॥ |
| తేది. 26 | బుధ | ఏకాదశి | ఉ॥ గం.7.37వ॥ |
| తేది. 27 | గురు | ద్వాదశి | ఉ॥ గం.6.29వ॥ |
| | పిదప | త్రయోదశి | రా॥ గం.5.03వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి పరంగా అభివృద్ధి ఉంటుంది. ఆదాయము వృద్ధిచెందుతుంది. వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. వ్యాపార రాబడిపై అసంతృప్తి ఉంటుంది. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. కుటుంబసభ్యుల మధ్య అవగాహన లోపం వల్ల స్వల్ప విభేదాలుంటాయి. సంప్రదింపులు సమావేశాలలో మీకు విలువ ఉంటుంది. బిడ్డల విద్యావృద్ధి, వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుమిత్రులకు సహాయ సహకారాలు అందించగలరు. భాగస్వామిక వ్యాపార, ఆర్థిక చర్చలు పురోగతిన సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి వ్యాప్తి, అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులు లాభాలనందిస్తాయి. పెద్దలతో పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. ఉద్యోగులకు అధికారుల వద్ద గుర్తింపు గౌరవాలు, స్థాన మార్పులుంటాయి. క్రొత్త వస్తువులు కొంటారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు నిదానంగా జరిగి విసుగు కలిగిస్తాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. గృహ వస్తువాహన రిపేర్లుండగలవు. పిల్లల విద్యా వివాహ విషయాలపై ఆందోళన ఉంటుంది. వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమించి రాబడి పెంచుతారు. వృత్తి జీవనం వారికి ఆదాయం బాగుంటుంది. ముఖ్యవ్యవహారాలేవైనా జాగ్రత్తగా నిర్వహించండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికాభివృద్ధికి చేసే ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్థిరాస్తుల వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. సోదరులతో అభిప్రాయ భేదాలు రాకుండా చూచుకొనండి. మొగమాటాలకు, విలాసాలకు ఖర్చులు పెరుగుతాయి. పెట్టుబడులకు, కొత్త వ్యాపారాలకు అనుకూల సమయం.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సొంత పనులు వ్యవహారాలలో ముందు జాగ్రత్త చూపండి. వ్యాపారవర్గాలకు ఆర్థిక ఇబ్బందులుండవచ్చును. వృత్తి పరంగా రాబడి బాగుంటుంది. ఈ రాశి వారికి ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. స్థిరాస్తుల వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. బంధువర్గం వల్ల స్వల్ప సమస్యలుండవచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకడం ఆలస్యం కావచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక స్థితి బాగుండి వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకంగా ఉండి ఆదాయము పెరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్‌గా ఉంటుంది. వేడుకలు దైవ కార్యాలలో పాల్గొంటారు. ప్రముఖులు, పెద్దలతో పరిచయాలుంటాయి. పెట్టుబడులకు అవకాశాలు, షేర్లలో లాభాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.


# కష్టపడి చదివి.. ఉన్నతస్థాయికి

## - విఆర్‌సి విద్యార్థికి అభినందన




కష్టపడి చదువుకునే విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించి సమాజంలో గౌరవనీయమైన స్థాయిని అందుకుంటారని విఆర్ కళాశాలకు చెందిన బమ్మర్ అనే విద్యార్థి మరోసారి రుజువు చేశారు. ఈ విద్యార్థి ఇటీవల జరిగిన 'విప్రో' కంపెనీ (బెంగుళూరు) ప్రాంగణ ఎంపికలో విజయం సాధించాడు. ఆదివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఈ ఎంపికలకు మొత్తం 300మంది విద్యార్థులు హాజరు కాగా, అందులో 13మంది మాత్రమే ఇంటర్వ్యూలో విజయం సాధించారు. ఆ 13మందిలో 11మంది విద్యార్థినులు కాగా, మిగిలిన ఇద్దరు విద్యార్థుల్లో బమ్మర్ ఒకరు. విఆర్‌సిలో బిఎస్సీ మూడవ సంవత్సరం చదువుతున్న బి.వి బమ్మర్‌ను ఆ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, కెమిస్ట్రీ, మేథమేటిక్స్ విభాగాధిపతులు డాక్టర్ కె.అశోక్‌రావు, పి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఫిజిక్స్ రీడర్ డాక్టర్ జి.కృష్ణకిశోర్, అధ్యాపకులు బి.వేమారెడ్డి, వివి కృష్ణశర్మ, ఎన్ హనుమంతకుమార్, జి.అనంతశేషసాయి, జి. శ్రీనివాసులు, ఆర్.గోపి అభినందించారు.

# గొలగమూడిలో వేడుకగా శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



వెంకటాచలం మండలంలోని గొలగమూడి గ్రామంలో వెలసివున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 33వ ఆరాధనోత్సవాలు ఈ నెల 18 నుంచి అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఆకలైనవారికి అన్నం పెట్టాలయ్యా-ఆపదల్లో వున్నవారిని ఆదుకోవాలయ్యా'..అంటూ తమ దివ్యమైన బోధలతో భక్తులందరి హృదయాల్లో ఆరాధ్యదైవంగా నిలచిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆపదలు తీర్చే ఆపద్బాంధవునిగా, కోరిన కోరికలు తీర్చే భక్తవరదునిగా ప్రసిద్ధి. ప్రతి ఏటా స్వామివారి ఆరాధనోత్సవాలకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి ఒక ప్రవాహంలా తరలివస్తూనే వుంటారు. ఈ ఏడాది కూడా పెద్దఎత్తున భక్తులు స్వామివారి ఆరాధనకు విచ్చేయవచ్చని భావిస్తున్నారు. స్వామివారి ఆరాధనోత్సవాల్లో భాగంగా, ఈ నెల18న సర్వభూపాల వాహనం-కల్పవృక్ష వాహనసేవలు కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా, 19న హనుమంత వాహనసేవ, చంద్రప్రభ వాహనం, 20న చినశేషవాహనసేవ – హంస వాహనసేవ, 21న సూర్యప్రభ వాహనసేవ-గజవాహనసేవలు జరిగాయి. 22న ఉదయం 10 గంటలకు స్వామివారికి అశ్వవాహన సేవ, పెదశేషవాహన సేవ, 23వ తేదీ ఉదయం 9 గంటలకు గరుడ వాహనసేవ, 10 గంటలకు సింహవాహన సేవ నిర్వహించనున్నారు. 24వ తేది స్వామివారి ఆరాధనలో ముఖ్యమైన రోజు. ఆ రోజు ఉదయం 9 గంటలకు సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు గొలగమూడి వీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు, మళ్ళీ రాత్రి 9 గంటలకు స్వామివారికి వాహనోత్సవాలు నిర్వహిస్తున్నారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ కార్య నిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం, ఆశ్రమ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని విద్యుద్దీపాలతో, పుష్పాలంకరణలతో శోభాయమానం చేశారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులందరినీ బాగా ఆకట్టుకుంటున్నాయి.

• కావలికి...

# ఉత్తరాన రామాయపట్నం... దక్షిణాన విమానాశ్రయం!

## - రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద



కావలి పట్టణానికి ఉత్తరం రామాయపట్నం పోర్టు, దక్షణాన దామవరం వద్ద విమానాశ్రయం నిర్మాణం జరుగుతుందని, దాని ద్వారా కావలి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు, మాజీశాసనసభ్యులు బీద మస్తాన్‌రావు.

ఆగష్టు 15న కావలి పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించి ప్రజల ఇబ్బందులను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అటల్ అమృత్' అనే పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టనుందని, దాని ద్వారా కావలి మున్సిపాలిటీ మరింత బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు గ్రామాల నుండి పట్టణాలకు వలస వస్తున్నారని, వారికి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 2015-16 సంవత్సరానికి గాను మున్సిపాలిటి 16కోట్ల రూపాయలతో పట్టణ అభివృద్ధి బడ్జెట్ రూపొందించిందన్నారు. అదే విధంగా 160కోట్లతో అండర్‌డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 168 కోట్లతో సంగం బ్యారేజి నుండి నేరుగా కావలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు పైపులైన్ వేసి మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రామాయపట్నం పోర్టు త్వరితగతిన ప్రారంభం అవుతుంది. అదే విధంగా దామవరంలో 246 ఎకరాల భూమి సేకరించడం జరిగిందన్నారు. 25వవార్డులో సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నామని, వార్డు అభివృద్ధికి 34లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కౌన్సిల్‌లో ఆమోదింపజేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్ కుమార్, శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాసకిరణ్, తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లికార్జునరెడ్డి, కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

# కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



కావలి మున్సిపాలిటి కమిషనర్‌గా అన్నవరపు వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఆయన 1, 4వార్డులను పరిశీలించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిస్థితులను గమనించిన ఆయన పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుందని, త్వరలో శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుద్ధ్యం విషయంలో టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు ద్వారా ప్రజలు సమాచారం అందించిన వెంటనే చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు. గత కమిషనర్ భానుప్రతాప్ పట్టణ అభివృద్ధి విషయంలో కొన్ని ప్రణాళికలు రూపొందించి ఉన్నారని, అవసరమైన మేరకు వాటిని అనుసరించి ముందుకు వెళ్తామన్నారు.

# వాడవాడలా జాతీయ జెండా రెపరెపలు



ఆర్డీఓ కార్యాలయంలో...



ఎమ్మార్వో కార్యాలయంలో...




రూరల్ పోలీస్‌స్టేషన్‌లో...



బాపూజీ విగ్రహానికి మాల వేస్తున్న తిరువీధి ప్రసాద్

కావలి పట్టణంలో 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 15వ తేదీ ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎం.లక్ష్మీనరసింహం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెంకట సత్యనారాయణ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంధ సంస్థలవారు హాజరై జెండా వందనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 69సంవత్సరాలు అయినా మనం అభివృద్ధిలో వెనుకబడి వున్నామన్నారు. కందుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ కేంద్ర, రాష్ట్రాలలో ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి పథకాలను వివరించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ పాల్గొని ఉపన్యసించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థినులు తన్మయ, రియ, తేజస్విని, లక్ష్మిప్రసన్న, లక్ష్మి గాయత్రి, గీతిక, మహిత, స్వాతి, సాయికీర్తి, దాక్షాయణిలు కూచిపూడి, భరతనాట్యం, జానపద, దేశభక్తి గేయాలకు నృత్యాలతో అలరించారు. కావలి తహశీల్దార్ సాంబశివరావు, 2వ పట్టణ సిఐ మంగారావు, ఎస్ఐ అన్వర్‌బాషాలు పాల్గొన్నారు. కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. వైయస్సార్సీపీ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కావలి డిఎస్‌పి రాఘవరావు జెండాను ఆవిష్కరించారు. రూరల్ సిఐ మధుబాబు, 1వ పట్టణ సిఐ వెంకట్రావు, ఎస్ఐ రఘునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



# కమిషనర్‌ను కలిసిన టిడిపి నాయకులు

నూతనంగా కావలి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలను చేపట్టిన అన్నవరపు వెంకటేశ్వర్లును పట్టణ టిడిపి నాయకులు కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ ప్రధానకార్యదర్శి అమరా వేదగిరి సుబ్బారాయుడు గుప్తా కమిషనర్‌కు టిడిపి సభ్యులను పరిచయం చేశారు. అదే విధంగా పట్టణంలోని పలు వార్డుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందిస్తూ త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని, మీ అందరి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గాదంశెట్టి వేణుగోపాల్, సన్నిబోయిన నారాయణప్రసాద్, ఎస్.రవిశేఖర్‌రావు, కె.రామమోహన్‌రావు, శేషారెడ్డి, ఇబ్రహీమ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో స్వాతంత్ర్య వేడుకలు

## రక్తదానం చేసిన ఎమ్మెల్యే ప్రతాప్



కావలి రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక అభయం స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ అధ్యక్షులు ఆర్డీఓ లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రక్తదానం చేశారు. ఆయన స్ఫూర్తితో పలువురు స్వచ్ఛంధంగా రక్తదానం చేయటం విశేషం.

# పరిశ్రమల ఓఎస్‌డిగా చుక్కా కొండయ్య



నెల్లూరుజిల్లా దగదర్తి మండలం పెదపుత్తేడు పంచాయితీ పరిధిలోని గొట్లపాళెం నివాసి డా॥ చుక్కా కొండయ్యను ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్(సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు) ఓఎస్‌డిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కొద్ది రోజుల క్రితమే ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఇకి డైరెక్టర్ జనరల్‌గా పదేళ్ల పాటు పనిచేశారు. చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలపై ఆయనకు విశేష అనుభవం వుంది. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ తగిన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. ఓఎస్‌డిగా బాధ్యతలు చేపట్టక ముందు ఆయన హైదరాబాద్‌లో ఎన్టీఆర్ భవన్ ఇన్‌ఛార్జ్‌గా చాలాకాలం పని చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఓఎస్‌డిగా కీలక బాధ్యతలు అప్పగించింది.

## మాగుంట శరత్‌చంద్రారెడ్డి యూత్ ఆధ్వర్యంలో
# స్వాతంత్ర్యవేడుక



నెల్లూరు రామలింగాపురంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 15వ తేదీ 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు పతాకావిష్కరణ గావించారు. స్కూల్లోని 350మంది విద్యార్థులకు సమితి సభ్యులు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు నిషాద్, రహీం, సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కేంద్రం లక్ష్యం

## - కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు వెల్లడి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు రూపొందిస్తోందని కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు అన్నారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని కిసాన్ సమాధాన్ కేంద్రంలో నెల్లూరు కృషి విజ్ఞాన్ కేంద్రం సహకారంతో ఆదివారం నిర్వహించిన కిసాన్ సమ్మేళన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ కూడా పాల్గొన్నారు. వ్యవసాయశాఖను రైతు సంక్షేమ శాఖగా పేరు మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. పంటపొలాలకు సాగునీరు అందించేందుకు కేంద్రం రూ. 5వేల కోట్లు కేటాయించిందని, రైతులకు రుణాలు అందించేందుకు మరో 8.5 లక్షల కోట్లు మంజూరుచేసిందని ఆయన తెలిపారు. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు సూచనలు అందజేసి వ్యవసాయం అభివృద్ధికి కృషిచేస్తున్నారని, రైతుల సందేహాలను తీర్చేందుకు కేంద్రం ప్రత్యేక ఛానల్‌ను కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు. కేంద్రం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో




బావున్నాయని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ కార్యక్రమాలు బాగా ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజలకు ఎనలేని సేవలను అందిస్తోందని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, తిరుపతి ఎంపి వి.వరప్రసాద్, జిల్లా కలెక్టర్ జానకి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, శాసన మండలి సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.




# 28న క్రీడా ప్రతిభా పురస్కారాలు

ప్రతి సంవత్సరంలాగే సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఈ సంవత్సరం కూడా ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. గురువారం ఉదయం ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014 జులై 1వ తేదీ నుండి 2015 జూన్ 30వ తేదీ వరకు క్రీడలలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 26తారీఖులోగా తమ సర్టిఫికేట్‌లను మేము ఇచ్చే అప్లికేషన్‌లో జత పరచి ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు తమ కోచ్ సంతకాలు, ఫోన్ నెంబరు తప్పనిసరిగా అప్లికేషన్‌లో నింపాలన్నారు. అప్లికేషన్లు 21వ తేదీ నుండి 26వ తేదీ ఉదయం వరకు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం మరియు నవాబుపేటలోని సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫీసు నందు పొందాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్ విన్నర్స్, పార్టిసిపెంట్స్, జాతీయ స్థాయిలో మెడల్ విన్నర్స్, పార్టిసిపెంట్స్, రాష్ట్ర స్థాయి మెడల్ విన్నర్స్ మాత్రమే అర్హులని ఈ నెల 29న మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం జరుపుతున్నామని, కాని ఆరోజు రాష్ట్ర బంద్ కాబట్టి ఈ నెల 28వ తేదీన ఈ కార్యక్రమాన్ని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో జరుపుతున్నామన్నారు. సుమారు ప్రతి సంవత్సరం 300మంది క్రీడాకారులను, గురువులను సత్కరిస్తున్నా మన్నారు. వివరాలకు 9848465056, 9949191977 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాకేష్‌చౌదరి, సరాబు సుబ్రహ్మణ్యం, వెంకట్‌లు పాల్గొన్నారు.

# మృత్యుహేల

(మొదటి పేజీ తరువాయి)

చదువుల నిలయాలుగా ఉంటూ, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన విద్యా సంస్థలు మృత్యు కారాగారాలుగా మారుతున్నాయి. ఎందరో విద్యార్థుల బ్రతుకును, భవిష్యత్‌ను చిదిమేస్తున్నాయి. ర్యాగింగ్ పేరుతో కొన్ని విద్యాసంస్థలలో, చదువుల ఒత్తిళ్లతో మరికొన్ని కళాశాలల్లో ఇటీవల ఆత్మహత్యలు పెరిగాయి. అసలు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం వంటివి చాలా ఆందోళన కలిగించే పరిణామం. ఇంటర్, డిగ్రీ చదివే వయసులో విద్యార్థులకు ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు ఎందుకొస్తున్నాయి. వాళ్లకు ఆర్థిక కష్టాలు తెలియవు, అప్పులుండవు, ప్రేమ వ్యవహారాల వయసు కాదు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనే ప్రశ్న లేదు. మరి విద్యార్థుల ఆత్మహత్యలెందుకు జరుగుతున్నట్లు?

ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ నేతృత్వంలో నడుస్తున్న నారాయణ విద్యా సంస్థలలోనే విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ ఏడాదే 11మంది దాకా ఆత్మహత్యలు చేసుకున్నట్లు తెలుస్తోంది. మొన్న కడప సమీపంలోని నారాయణ కాలేజీలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై విపక్షాలు మండిపడుతున్నాయి. వైకాపా అధినేత జగన్ నేరుగా వచ్చి కడపలోనే ధర్నాకు దిగడం, కడప జిల్లా అంతా బంద్ నిర్వహించడం చేశారు. నారాయణ విద్యా సంస్థలలో జరుగుతున్న మృత్యుఘోషపై రాష్ట్ర వ్యాప్తంగా విపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు భగ్గుమంటున్నాయి. నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు తర్వాత నారాయణదే హవా! మరి ఎన్ని ఆందోళనలు చేసినా ఆయనకేమవుతుంది?

రాష్ట్రంలో సర్కార్ చదువులు చతికిల బడేలా కార్పొరేట్ చదువులకు శ్రీకారం చుట్టిందే నారాయణ. అంతకుముందు స్థానికంగా ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ఉండేవి కాని, ఒకే విద్యాసంస్థకు సంబంధించినవి రాష్ట్ర వ్యాప్తంగా వుండేవి కావు. నారాయణ కార్పొరేట్ విద్యను ప్రవేశపెట్టాడు. మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా పాకాడు. నెల్లూరు జిల్లాలో అయితే మండల కేంద్రాలలో కూడా నారాయణ స్కూల్స్ వెలిసాయి. ఇక నారాయణ ఇంటర్ కాలేజీలకైతే లెక్కే లేదు. నారాయణ కాలేజీల వల్లే ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు విద్యార్థులు లేక మూతపడే పరిస్థితి వచ్చింది.

ర్యాంకులు, మార్కుల సంస్కృతి కూడా సర్కార్ చదువును నిర్వీర్యం చేసింది. ప్రతి ఒక్కరిలోనూ ర్యాంకుల ఫోబియా వచ్చింది. ఇప్పుడు తల్లిదండ్రుల ఆలోచనలన్నీ కూడా ఇంజనీరింగ్, మెడిసిన్‌ల చుట్టే తిరుగుతున్నాయి. ఆ బలహీనతను నారాయణ బాగా సొమ్ము చేసుకున్నాడు. ఇంజనీరింగ్‌లో మెడిసిన్‌లో ర్యాంకు కొట్టాలన్నా, టెన్త్, ఇంటర్‌లలో మంచి మార్కులు సాధించాలన్నా నారాయణ స్కూల్స్, కాలేజీలలోనే చదవాలనే ఒక పరిస్థితిని కల్పించారు. ఎంసెట్, ఐఐటి, జెఇఇ, ట్రిబుల్ ఐటి వంటి పేర్లతో ఇంటర్మీడియట్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసి ఒక్కో సెంటర్‌కు ఒక్కో రకంగా ఫీజులు పిండుతుంటారు.

'నారాయణ' విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులపై చిన్న ఒత్తిడి ఉండదు. తెల్లారుజామున 4గంటల నుండి రాత్రి 10గంటల వరకు కూడా చదువుల పేరుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. రెసిడెన్షియల్ క్యాంపస్‌లలో అయితే సెలవు దినాలలో కూడా క్లాసులు జరుగుతుంటాయి. ఒకరకంగా విద్యార్థులను పుస్తకాలు చదివిన రోబోలుగా తీర్చిదిద్దుతుంటారని చెప్పవచ్చు. ఈ మాత్రం చదివితే సర్కార్ కాలేజీల్లో చదివే వాళ్లకు కూడా ఇంతకంటే మంచిర్యాంకులే వస్తాయి. చదువుల పేరుతో విద్యార్థులను మానసికంగా నలిగిపోయేలా చేస్తున్నారు. ఇంకో పక్క తల్లిదండ్రులు కూడా మా ఆస్తులు అమ్మి మిమ్మల్ని చదివిస్తున్నాం, మంచి ర్యాంకు తెచ్చుకోవాలంటూ పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఒత్తిళ్లను తట్టుకోలేక, మానసికంగా నలిగిపోతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మన విద్యా విధానం పూర్తిగా కలుషితమైంది. చదువుకునే పరిస్థితి పోయి చదువులు కొనే పరిస్థితి వచ్చింది. రాష్ట్ర విద్యారంగాన్నయితే 'నారాయణ' పూర్తిగా ఆక్రమించేసింది. ర్యాంకుల విషసంస్కృతికి పెద్దపీట వేస్తూ విద్యార్థులను ఆ దిశగా 24గంటలూ తోముతున్నారు. ఈ పద్ధతి మారకుంటే మనం ఇంకా చాలామంది విద్యార్థుల తల్లిదండ్రుల కడుపుకోతను చూడాల్సి వుంటుంది.

# బాబుకు డామేజీ

(మొదటి పేజీ తరువాయి)

ఇంతవరకు గట్టిగా నాలుగువేల కోట్ల సాయం కూడా అందలేదు. అసలు ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేస్తున్నదే ప్రత్యేక హోదాను. కేంద్రం ఈ విషయంలో చేతులెత్తేసింది. ప్రత్యేకహోదాను గట్టిగా అడగలేకపోతున్నాడనే నింద చంద్రబాబుపై ఇప్పటికే వుంది. ఇప్పుడు కేంద్రం బీహార్‌కు భారీ ప్యాకేజీ ఇచ్చింది. ప్రత్యేకహోదా మాట అటుంచితే కనీసం బీహార్ తరహా ప్యాకేజీనైనా సాధించాలని చంద్రబాబు మీద విపక్షాలు ఒత్తిడిపెంచే అవకాశముంది.

# వాత్సల్యలో జెండా పండుగ




నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోని జనహిత-వాత్సల్య భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషుమీడియం హైస్కూల్లో 15వ తేదీ 69వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వితరణశీలి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గుండె వ్యాధి వైద్య నిపుణులు డా॥ శ్రీనివాసరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు తన ప్రసంగంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలబాలికలచే అన్నమాచార్య కీర్తనలు, కోలాటం, కీబోర్డు తదితర నృత్య ప్రదర్శనలు, పి.ఇ.టి.చే పిరమిడ్, స్వాతంత్ర్య విన్యాసాలు ప్రదర్శించారు. యం.వి.చలం, యం.సత్యనారాయణ, యోగా గురువు నరసింహశాస్త్రిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంత గోపాలరెడ్డి, చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జయప్రకాష్, ప్రధానోపాధ్యాయులు యం.మధుసూధనరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ॥ శే॥ శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2015 నాటికి 25 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్థాంగి: **కీ॥శే॥ గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు – కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్ణారెడ్డి – ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి – సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి – శుభప్రదమ్మ**

కుమార్తెలు – అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ – కీ॥ శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ – అత్తివరపు రామచంద్రారెడ్డి**
**దొడ్ల లలితమ్మ – దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com